ప్రజా కలం Digital Editions
http://prajakalam.com
epaper.prajakalam.com
paperboy.com
www.magzter.com

epaper.prajakalam.in
www.prajakalam.in

# ప్రజా కలం

Published From Nizamabad

PRAJA KALAM Telugu Daily తెలుగు దినపత్రిక

PRGI No.TELTEL/2010/33275

ప్రజా కలం PRAJA KALAM Telugu Daily
Classifieds & Public Notice Advertising
5 Lines Rs.250 only
క్లాసిఫైడ్స్ సంప్రదించండి
9010972526

సోమవారం | 11-05- 2026 | సంపుటి: 17, సంచిక: 39, నిజామాబాద్, పేజీలు: 12, వెల: 3/- ◆ ఎడిటర్: కలకొండ రామకృష్ణ ◆




# గుజరాత్ కంటే రెట్టింపు నిధులిస్తాం

- గుజరాత్‌కు ఇచ్చినన్ని నిధులు తెలంగాణకూ ఇస్తాం
- అలా ఇస్తే ఇప్పుడు సగమే వస్తాయి.. అవి మీకు సరిపోతాయా?
- ఉమ్మడి ఏపీలో రైల్వేకు వెయ్యి కోట్లిస్తే మేము ఒక్క తెలంగాణకే రూ.5,500 కోట్లు ఇచ్చాం హెచ్ఐసీసీలో ప్రధాని మోదీ
- రూ. 9,400 కోట్ల అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు
- హాజరైన కేంద్రమంత్రులు కిషన్‌రెడ్డి, బండి సంజయ్, సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రి కోమటిరెడ్డి
- తెలంగాణ అభివృద్ధికి మీ సహకారం కావాలి: సీఎం

హైదరాబాద్, మే 10 (ప్రజా కలం ప్రతినిధి) తెలంగాణ అభివృద్ధి చెందితేనే భారత్ అభివృద్ధి చెందుతుందని ప్రధాని నరేంద్ర మోదీ అన్నారు. 'గుజరాత్‌కి ఆ రోజు ఎంత ఇచ్చారో ఇప్పుడు తెలంగాణకు అంత ఇస్తే మేము ఇవ్వాలనుకున్న దానిలో సగమే వస్తాయని, ఆ రోజు గుజరాత్‌కి చేసిన కేటాయింపులకు రెట్టింపు తెలంగాణకు ఇవ్వాలని

తరువాయి 2వ పేజీలో...



## తమిళనాట
# నవశకం

- విజయ్‌తో పదవీప్రమాణం చేయించిన గవర్నర్ రాజేంద్ర అర్లేకర్
- బుస్సీ ఆనంద్, ఆదవ్ అర్జున, సెంగోట్టయ్యన్, కీర్తన సహా 9 మంది మంత్రులతో కూడా..
- హాజరైన రాహుల్‌గాంధీ.. రాష్ట్ర కాంగ్రెస్, లెఫ్ట్, బీజేపీ నేతలు సైతం
- చెన్నై నెహ్రూ స్టేడియానికి భారీగా వచ్చిన అభిమానులు, కార్యకర్తలు
- వేదికపైనే ఉచిత విద్యుత్తు ఫైలుపై కొత్త ముఖ్యమంత్రి తొలిసంతకం
- మహిళల టాస్క్‌ఫోర్స్, యాంటీ-నార్కోటిక్ ఫోర్స్ ఏర్పాటుపైనా..
- తర్వాత సచివాలయంలో బాధ్యతలు.. ఉన్నతాధికారుల అభినందనలు

చెన్నై, మే 10 : తమిళనాట ఆరు దశాబ్దాల ద్రవిడ పార్టీల పాలనకు తెరపడింది. రాష్ట్రంలో 59 ఏళ్ల తర్వాత తొలిసారి ద్రవిడ పార్టీయేతర ప్రభుత్వం కొలువుదీరింది. ముఖ్యమంత్రిగా తమిళగ వెట్రి కళగం (టీవీకే) అధ్యక్షుడు.. 'ఇళయదళపతి' జోసెఫ్ విజయ్ ఆదివారం ఉదయం చెన్నై నెహ్రూ ఇండోర్ స్టేడియంలో ప్రమాణ స్వీకారం చేశారు. వేల మంది సినీ అభిమానులు, పార్టీ శ్రేణులు, పార్టీ ప్రముఖులు, కార్యకర్తల హర్షధ్వానాల నడుమ గవర్నర్ రాజేంద్ర విశ్వనాథ్ అర్లేకర్ ఆయనతో పదవీప్రమాణం చేయించారు. కాంగ్రెస్ అగ్ర నేత రాహుల్‌గాంధీ ప్రత్యేకంగా హాజరయ్యారు. వేదికపై విజయ్‌కి కుడివైపు ఆయన, గవర్నర్ ఎడమవైపు ఆశీనులయ్యారు. రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సాయికుమార్ ప్రమాణ స్వీకారోత్సవానికి అనుమతి ఇవ్వాలని కోరగా.. గవర్నర్ అంగీకారం తెలిపారు. ఆ తర్వాత గవర్నర్, విజయ్ మైకుల ముందు నిలిచారు. విజయ్.. 'జోసెఫ్ విజయ్ ఎనుమ్ నాన్ (జోసెఫ్ విజయ్ అనే నేను) అని అనగానే స్టేడియం కరతాళ ధ్వనులు, ఈలలతో ప్రతిధ్వనించింది.

తరువాయి 2వ పేజీలో...

# ఈ విద్యాసంవత్సరం ఇంటర్ అడ్మిషన్లు యథాతథమే..

హైదరాబాద్, మే 10 (ప్రజా కలం ప్రతినిధి)

ఇంటర్ బోర్డును రద్దు చేసి పాఠశాల విద్యలో విలీనంచేయాలనే నిర్ణయంపై రాష్ట్ర ప్రభు త్వం వెనక్కి తగ్గింది. ఈమేరకు ఆదివారం కీలక ప్రకటనను చేసింది. ఈ ఏడాది యథావిధిగా ఇంటర్మీడియట్ ప్రవేశాలు చేపట్టాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. ప్రవేశాలకు సమయం తక్కువగా ఉండడం, ఇంటర్మీడియ ట్‌ను పాఠశాల విద్యలో విలీనం చేసే ప్రక్రియకు పలు సాంకేతిక సమస్యలు అడ్డుగా ఉండడంతో నూతన విద్యాసంవత్సరానికి సంబంధించి విద్యార్థులకు నష్టం జరగకుండా వెంటనే ప్రవేశాల ప్రక్రియ ను చేపట్టాలని సీఎం సూచించారు. ఇంటర్మీడియట్‌ను రద్దుచేసి సీబీఎస్ఈ తరహాలోనే 11, 12 తరగతులు నిర్వహించాలని.. ఫలితంగా డ్రాపౌట్స్ సంఖ్య గణనీయంగా తగ్గుతుందని తెలంగాణ ఎడ్యుకేషన్ కమిషన్ రాష్ట్ర ప్రభుత్వానికి సూచించింది. సీబీఎస్ఈతో పాటు మెజారిటీ రాష్ట్రాలు 11, 12 తరగతుల విధానాన్ని అనుసరిస్తున్నాయి. మన రాష్ట్రంలో మాత్రం ఇంటర్మీడియట్ విద్య వేరుగా ఉంది. ప్రభుత్వ పాఠశాలల్లో పదో తరగతి వరకు చదివిన విద్యార్థుల్లో అత్యధికులు ఆ తర్వాత ఇంటర్మీడియట్‌కు వేరుగా ఉన్న కళాశాలల్లో చేరడం లేదని, అక్కడితో విద్యను నిలిపివేస్తున్న విషయాన్ని ప్రభుత్వం గుర్తించిందన్నారు.



# గుజరాత్ కంటే రెట్టింపు నిధులిస్తాం

మొదటి పేజీ తరువాయి...

తాను ప్రయత్నిస్తున్నట్లు ప్రధాని పేర్కొన్నారు. సగం నిధులే ఇస్తే అవి మీకు సరిపోతాయా? మీరు ఏదైతే లక్ష్యాన్ని అనుకున్నారో దాన్ని చేరుకోలేరని, అందుకే మీరు మాతో కలవండి అంటూ సీఎం రేవంత్‌రెడ్డికి నవ్వుతూ సల హా ఇచ్చారు. మన్మోహన్ సింగ్ ప్రధానిగా ఉన్నప్పుడు గుజరాత్ సీఎంగా నరేంద్ర మోదీ ఉన్న సమయంలో ఎలా అయితే సహకారం అందించారో,

నిధులిచ్చారో అలా తెలంగాణకు కూడా ప్రస్తుతం ప్రధానిగా ఉన్న మోదీ ఇవ్వాలని సీఎం రేవంత్‌రెడ్డి కోరడంపై ప్రధాని మోదీ ఈ విధంగా స్పందించారు. అభివృద్ధి కోసం తమతో కలిసి రావాలంటూ రేవంత్‌కు హితవు పలికారు. ఆదివారం హెచ్ఐసీసీలో జరిగిన కార్యక్రమంలో దాదాపు రూ.9,400 కోట్ల అభివృద్ధి పనులకు సీఎం రేవంత్‌రెడ్డి, గవర్నర్ శివప్రతాప్ శుక్లా, కేంద్ర మంత్రులు కిషన్‌రెడ్డి, బండి సంజయ్, మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డితో కలిసి ప్రధాని మోదీ వర్చువల్‌గా శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేశారు. అనంతరం మోదీ మాట్లాడు తూ.. తెలంగాణ అభివృద్ధికి కేంద్రం ఎన్నో పథకాలను అమలు చేస్తోందని అన్నారు.

రాష్ట్రంలో రోడ్డు, రైలు కనెక్టివిటీని భారీగా పెంచామన్నారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తన మాటలను జాగ్రత్తగా వినాలన్నారు. రైల్వే బడ్జెట్‌లో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌కు రూ.వెయ్యి కోట్లు కూడా వచ్చేవి కాదని, కానీ ఇప్పుడు ఒక్క తెలంగాణకే రూ.5,500 కోట్లు కేటాయించామన్నారు. కేవలం రోడ్ల నిర్మాణానికే రూ.2 లక్షల కోట్లు కేటాయించామని చెప్పారు. దీనివల్ల తెలంగాణకు ఎంతో లాభం చేకూరింద న్నారు. రాష్ట్రానికి 5 వందే భారత్, 6 అమృత్ భారత్ ఎక్స్‌ప్రెస్ రైళ్లను ఇచ్చామని, కాజీపేట జంక్షన్‌ను వేల కోట్లతో అభివృద్ధి చేస్తున్నాం అని ఆయన గుర్తు చేశారు. రాష్ట్రం అభివృద్ధి చెందాలని కోరుకోవడంలో తప్పులేదని, అందుకే తాము అన్ని రాష్ట్రాలను అభివృద్ధిలో భాగస్వామ్యం చేస్తున్నామని, రాష్ట్రాలు అభివృద్ధి చెందకుండా దేశం అభివృద్ధి చెందదన్నారు.

**సైబరాబాద్ అతిపెద్ద ఉపాధి కేంద్రం**

దేశాభివృద్ధిలో సైబరాబాద్ కీలక పాత్ర పోషిస్తుందని, అతి పెద్ద ఉపాధి కేంద్రంగా మారిందని మోదీ అన్నారు. అనేక పెద్ద ప్రాజెక్టులు ఇక్కడ పురుడు పోసుకుంటున్నాయని పేర్కొన్నారు. అంతర్జాతీయ పెట్టుబడులను ఆకర్షించేలా సైబరాబాద్‌ను తీర్చిదిద్దుతున్నామని అన్నారు. సైబరాబాద్ అభివృద్ధికి కేంద్రం వేలాది కోట్లు కేటాయించిందని, అంతర్జాతీయ స్థాయిలో సైబరాద్‌కు గుర్తింపు ఉన్నదన్నారు. సైబర్‌టెక్నాలజీ, విద్యుత్, ఈవీ రంగాల్లో కీలక పాత్ర పోషిస్తోందన్నారు.

ఇప్పుడు ప్రారంభించిన ప్రాజెక్టులతో వేలాది ఉద్యోగాలు యువతకు వస్తాయని తెలిపారు. వరంగల్‌లో పీఎం మిత్ర టెక్స్‌టైల్ పార్క్‌ను ప్రారంభించుకోవడం సంతోషకరంగా ఉందన్నారు. దేశ టెక్స్‌టైల్ రంగంలో ఇది కీలకపాత్ర పోషించనుందని, దీంతో భారీగా ఉ ద్యోగావకాశాలు వస్తాయన్నారు. జాతీయ రహదారుల అభివృద్ధికి కేంద్రం రూ.లక్షల కోట్లు ఖర్చు చేస్తోందన్నారు. దీని ద్వారా తెలంగాణ కూడా లాభపడుతోందని మోదీ అన్నారు.

ఇంధన భద్రతకు తమ ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తుందన్నారు. ప్రపంచం ఇప్పుడు ఇంధన సంక్షోభాన్ని ఎదుర్కొటోందని, ఆ ప్రభావం దేశంపై పడకుండా చూసుకున్నామన్నారు. ఇంధన భద్రతలో మల్కాపూర్ ప్రాజెక్టు కీలకమని చెప్పారు. మౌలిక వసతుల కల్పనకు తమ ప్రభుత్వం పెద్దపీట వేస్తున్నామని పేర్కొన్నారు. తెలంగాణ యువత కొత్త కలలు కంటున్నారన్నారు. రైతులు ఎంతో అభివృద్ధి సాధిస్తున్నారని చెప్పారు.

**పీఎంవోలో సింగల్ విండో టాస్క్‌ఫోర్స్ ఉండాలి..**

భారీ ఆర్థిక వృద్ధి, మహా నగరాలు, విశ్వ నగరాల నుంచే వస్తుందని, మనకు ఢిల్లీ, ముంబయి, చెన్నై, కోల్‌కతా, బెంగళూరు, హైదరాబాద్ ఆరు మహా నగరాలున్నాయని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. మన దేశం ప్రపంచంలో మొదటి స్థానంలో ఉండాలంటే, యువతకు ఉద్యోగాలు రావాలంటే ఈ మహా నగరాలను అభివృద్ధి చేయాలన్నారు. ఈ ఆరు మెట్రో నగరాలకు సంబంధించిన జాతీయ ప్రాధాన్యత గల అన్ని ప్రాజెక్టులకు కేంద్రం నుంచి అనుమతులు త్వరగా లభించేలా ప్రధానమంత్రి కార్యాలయంలో ప్రత్యేక సింగిల్ విండో టాస్క్ ఫోర్స్ ఉ ండాలని సీఎం కోరారు. 'నా రాష్ట్రం, నా ప్రజల కోసం సానుకూల నిర్ణయాల విషయి మా రాష్ట్రానికి సంబంధించిన కొన్ని ప్రాజెక్టులకు మీ అత్యవసర అనుమతులు, ఆమోదాలు అవసరం. మూసీ నది, మెట్రో రైలు, రేడియల్ రోడ్లు, హైదరాబాద్ వరకు 12 వరుసల రహదారికి సంబంధించి ఆమోదం కావాలి. రెండు గంటల పాటు మీరు సమ యం కేటాయించి వాటిని సమీక్షించాలి' అని మోదీకి సీఎం విజ్ఞప్తి చేశారు. 'కేంద్ర మంత్రు లు కిషన్‌రెడ్డి, సంజయ్ మిత్రులు.. మీకు పెద్ద మనస్సు ఉందని తెలంగాణ తెలుసు. నేడు వారు దాన్ని ప్రత్యక్షంగా చూడాలనుకుంటున్నారు.

తెలంగాణ అభివృద్ధికి సం బంధించిన పెండింగ్ పనులు, ప్రతిపాదనలు అన్నింటినీ మీరు ఆమోదిస్తారని తెలం గాణ ప్రజలు ఆశిస్తున్నారు' అని చెప్పారు. 'దేశం విషయంలో మేము మీతో కలిసి ఉన్నామని, మీరు వికసిత్ భారత్ 2047పైన మాట్లాడి, భారతదేశాన్ని 30 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా తీర్చిదిద్దే అంశంపై మాట్లాడినప్పుడు, మేం మా రాష్ట్ర కోణంలో తెలంగాణ రైజింగ్ 2047ను దానికి అనుసంధానం చేశాము' అని వెల్లడించారు.

**వివక్ష లేకుండా అభివృద్ధి చేస్తాం: కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి**

రాష్ట్రాల్లో ఏ ప్రభుత్వమున్నా వివక్షలేకుండా అభివృద్ధికి కేంద్రం సహకరిస్తుందని కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి తెలిపారు. గతంలో ప్రధాని రామగుండం ఫర్టిలైజర్ పరిశ్రమను ప్రారంభించడానికి, అదేవిధంగా రూ.13 వేల కోట్ల ఎన్‌టీపీసీ పవర్ ప్రాజెక్టును ప్రారంభించడానికి వచ్చినప్పుడు రాష్ట్ర ముఖ్యమంత్రి రాలేదన్నారు. ఎన్నికలప్పుడు రాజకీయాలున్నప్పటికీ ఎన్నికల తర్వాత తెలంగాణ అభివృద్ధే ఏకైక లక్ష్యంగా ముందుకుపోవాలన్నారు.

రీజనల్ రింగ్ రోడ్ ప్రాజెక్టుకు మూడేళ్ల క్రితమే కేంద్రం అనుమతి ఇచ్చిందని, భూసేకరణ ప్రక్రియ ముగిసి, కేంద్ర కేబినెట్ ఆమోదం లభించగానే పనులు ప్రారంభమవుతాయన్నారు. 2014 వరకు తెలంగాణలో 2,400 కి.మీ.ల జాతీయ రహదారులు ఉండగా, గత 11 ఏళ్లలో అదనంగా 2,600 కి.మీ కొత్త హైవేలను కేంద్రం నిర్మించిందని తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా 42 రైల్వే స్టేషన్ల ఆధునీకరణ పనులు జరుగుతున్నాయని చెప్పారు. సికింద్రాబాద్ రైల్వే స్టేషన్ రూ.220 కోట్ల వ్యయంతో శంషాబాద్ ఎయిర్‌పోర్టు స్థాయిలో అత్యాధునిక సదుపాయాలతో ఈ ఏడాది చివరికల్లా సిద్ధం చేస్తున్నామన్నారు.

ఇటీవలే చేర్లపల్లి రైల్వే స్టేషన్ను కూడా అందుబాటులోకి వచ్చిందన్నారు. రాష్ట్రం లో సమ్మక్క- సెంట్రల్ యూనివర్సిటీ, రైల్వే మాన్యుఫ్యాక్చరింగ్ యూనిట్, ఎయిమ్స్ ఆసుపత్రి వంటి ప్రతిష్టాత్మక ప్రాజెక్టులు కొనసాగుతున్నాయని పేర్కొన్నారు. ప్రధాని మోదీ ఆశయమైన 2047 నాటికి భారత్‌ను అభివృద్ధి చెందిన దేశం గా మార్చడంలో తెలంగాణ కీలక పాత్ర పోషించాలని పేర్కొన్నారు.



తెలంగాణపై మోదీ ఆశీర్వాదం ఉండాలి: సీఎం రేవంత్

ప్రధాని మోదీ అశీర్వాదం, సహకారం ఉంటే తెలంగాణ వేగంగా అభివృద్ధి సాధిస్తుందని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. ఐదు రాష్ట్రాల ఎన్నికలు పూర్తయ్యాయని, ఇప్పు డు తాము రాజకీయాల గురించి మాట్లాడబోమని, అభివృద్ధి గురించే మాట్లాడుతామ న్నారు. ఇది అభివృద్ధి ఉత్సవమని, కేంద్ర ప్రభుత్వం కార్యక్రమం కాదన్నారు. జాతీయ భద్రత, జాతీయ అభివృద్ధే మనకు అత్యధిక ప్రాధాన్యమని, ముందు భారత దేశం, తర్వాత ప్రజలు, ఆ తర్వాతే పార్టీ అనేది స్పష్టం చేశారు.

ఆ స్ఫూర్తితోనే దేశ నిర్మాణానికి ప్రధానమంత్రి మోదీ వికసిత్ భారత్ 2047ను ప్రకటించినప్పుడు, తాము భాగస్వాములయ్యామన్నారు. తెలంగాణ రైజిం గ్‌కు ప్రధాని సహకారం అందిస్తారనే విశ్వాసం తమకు ఉన్నదన్నారు. తెలంగాణను దేశంలో మొదటి స్థానంలో నిలిపేందుకు తాము ప్రయత్నిస్తున్నామన్నారు. 'మోదీ, గుజరాత్ ముఖ్యమంత్రిగా ఉ న్నప్పుడు నాటి ప్రధానమంత్రి డాక్టర్ మన్మోహన్ సింగ్ సహకారంతో మీరు గుజరాత్ మోడల్‌ను అభివృద్ధి చేశారు.

తెలంగాణ ప్రజలు కూడా రాబోయే పదేళ్లలో మీ సహకారంతో మా రాష్ట్రాన్ని అభివృద్ధి చేయాలని కోరుకుంటున్నారు. నాటి మన్మోహన్ సింగ్ విధంగా, ఆయన స్ఫూర్తితో మీరు నాకు పూర్తి సహకారం అందిస్తారని విశ్వసిస్తున్నా' అని కోరారు. 2034లో ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థకు చేరుకుంటామనే నమ్మకం ఉంది. 2047 వరకు 3 ట్రిలియన్ డాలర్లు ఆర్థిక వ్యవస్థకు చేరుకుంటామని ఆశిస్తున్నా. నాడు మన్మోహన్‌సింగ్ ఆశీస్సులు అందించినట్లే మీరు తెలంగాణ ప్రజలకు ఆశీస్సులు అందించాలి' అని సీఎం కోరారు.



## తమిళనాట నవశకం

మొదటి పేజీ తరువాయి...

ప్రమాణస్వీకారం మొదటి భాగాన్ని ఆయన కంఠస్థం చేసుకుని వచ్చారు. హావభావాలతో చేతులు పైకెత్తి, పిడికిలి బిగించి బిగ్గరగా చదివారు. రెండోభాగాన్ని చదివేందుకు సిద్ధమవుతుండగా.. ప్రతిని చూసి మిగతా సగభాగం ప్రమాణం చేయాలని గవర్నర్ సూచించారు. ఆ ప్రకారమే విజయ్ ప్రతిని చేతపట్టుకుని ప్రమాణ స్వీకారం పూర్తి చేశారు. ఆ తర్వాత వరుసగా మరో 9 మంది.. బుస్సీ ఎస్.ఆనంద్, ఆదవ్ అర్జునా, కేఏ సెంగోట్టయ్యన్, ఎస్.కీర్తన, కేజీ అరుణ్‌రాజ్, పి.వెంకటరమణన్, సీఆర్ నిర్మల్‌కుమార్, రాజ్‌మోహన్, టీకే ప్రభుతో గవర్నర్ మంత్రులుగా ప్రమాణం చేయించారు. ఈ వేడుకలో టీఎన్‌సీసీ అధ్యక్షుడు సెల్వపెరుంతగై, సీపీఎం నేత షణ్ముగం, సీపీఐ నేత వీరపాండ్యన్, బీజేపీ రాష్ట్ర శాఖ అధ్యక్షుడు నయినార్ నాగేంద్రన్, ఆ పార్టీ మహిళా నాయకురాలు తమిళిసై సౌందరరాజన్, వీసీకే, ఐఎంయూఎల్ నేతలు కూడా పాల్గొన్నారు. మాజీ సీఎంలు స్టాలిన్, పళనిస్వామి రాలేదు. అలాగే విజయ్ భార్య సంగీత, ఆయన కుమారుడు, కుమార్తె కూడా హాజరుకాలేదు.

**మూడు ఫైళ్లపై తొలి సంతకాలు..**

పదవీప్రమాణం చేసిన నెహ్రూ స్టేడియం వేదికపైనే సీఎం విజయ్ కీలకమైన మూడు ఫైళ్లపై సంతకాలు చేశారు. 200 యూనిట్ల ఉచిత విద్యుత్ సబ్సిడీ పథకంపై తొలి సంతకం.. మహిళల భద్రతకు కల్పించే దిశగా 'సింగపెణ్ స్పెషల్ టాస్క్‌ఫోర్స్' ఏర్పాటు ఫైలుపై రెండో సంతకం.. మాదకద్రవ్యాల రహిత రాష్ట్రంగా తీర్చిదిద్దే దిశగా మాదక ద్రవ్యాల నిరోధక దళం(యాంటీ-నార్కోటిక్ టాస్క్‌ఫోర్స్) ఏర్పాటుకు సంబంధించిన ఫైల్‌పై మూడో సంతకం చేశారు. స్టేడియంలో ప్రమాణస్వీకారం ముగిసిన తర్వాత విజయ్ సచివాలయానికి చేరుకున్నారు. అక్కడ పోలీసుల గౌరవ వందనం స్వీకరించారు. తర్వాత సీఎం చాంబర్లోకి వెళ్లి ముఖ్యమంత్రి కుర్చీలో ఆశీనులై బాధ్యతలు స్వీకరించారు. కొన్ని ఫైళ్లపై సంతకాలు చేశారు. కాగా.. విజయ్‌కు ప్రత్యేక కార్యదర్శులుగా సీనియర్ ఐఏఎస్ అధికారులు సెంథిల్‌కుమార్, లక్ష్మీప్రియ నియమితులయ్యారు.

**విజయ్ తల్లిదండ్రుల ఆనంద బాష్పాలు**

విజయ్ రాష్ట్ర ముఖ్యమంత్రిగా ప్రమాణం చేయడం చూసి ఆయన తండ్రి, సినీ దర్శకుడు ఎస్ఏ చంద్రశేఖర్, తల్లి, ప్రముఖ గాయని శోభా చంద్రశేఖర్ భావోద్వేగంతో కన్నీరు పెట్టుకున్నారు. జోసెఫ్ విజయ్ అనే నేను అని విజయ్ పలుకగానే ఆ దంపతుల ఆనందానికి అవధుల్లేకపోయాయి. కాసేపు ఇరువురూ కళ్లు మూసుకుని ధ్యానం చేశారు. తర్వాత విజయ్ ప్రసంగిస్తూ.. తాను సాధారణమైన సినీ అసిస్టెంట్ డైరెక్టర్ కుటుంబం నుండి వచ్చానని అన్నప్పుడు కూడా ఆ దంపతులు ఉద్వేగానికి గురయ్యారు.

**ప్యాంటు సూటుతో రిచ్‌లుక్‌లో విజయ్:**ప్రమాణ స్వీకారం సందర్భంగా విజయ్ వస్త్రధారణ చర్చనీయాంశమైంది. గత సీఎంల సంప్రదాయ పంచెకట్టుకు స్వస్తి పలికిన టీవీకే అధినేత.. సరికొత్త ఫ్రెష్ లుక్‌లో దర్శనమిచ్చారు. చాలా స్మార్ట్‌గా తెల్ల చొక్కాపై నల్ల బ్లేజర్ (కోటు) ధరించి రిచ్‌లుక్‌తో మైదానంలో అడుగుపెట్టగానే అభిమానుల ఈలలు, కేకలతో నెహ్రూ ఇండోర్ స్టేడియం దద్దరిల్లింది. తమిళనాడు రాజకీయ చరిత్రలోనే ప్యాంట్, సూట్ ధరించి ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేసిన తొలి నేతగా విజయ్ నిలిచారు. గతంలో కామరాజ్ నాడార్, అన్నాదురై, కరుణానిధి, నెడుంజెళియన్, ఎడప్పాడి పళనిస్వామి, ఎంకే స్టాలిన్ తమిళ సంప్రదాయ దుస్తులైన చొక్కా, ధోతీ ధరించి సీఎంలుగా ప్రమాణ స్వీకారాలు చేశారు. ప్రొటెం స్పీకర్‌గా ఎంవీ కరుప్పయ్య ప్రమాణ స్వీకారం జరిగిన లోక్‌భవన్‌లోనూ, వేప్పేరిలో ద్రవిడ ఉ ద్యమ నేత పెరియార్ స్మారక స్థలం వద్ద నివాళులర్పించే కార్యక్రమంలోను విజయ్ అదే డ్రెస్ ధరించారు.



## నత్త నడకన ధాన్యం సేకరణ

### అకాల వర్షానికి తడిచిన ధాన్యం

### కొనుగోలు వేగవంతం చేయాలని రైతులు, బీఆర్ఎస్ నాయకుల ధర్నా

రుద్రంగి, మే 10, (ప్రజాకలం ప్రతినిధి)

రాజన్న సిరిసిల్ల జిల్లా రుద్రంగి మండలంలో ధాన్యం సేకరణ నత్తనడకన సాగుతోంది. నెల రోజులకు పైగా కొనుగోలు కేంద్రాల్లో ఎక్కడ చూసిన ధాన్యం కుప్పలు దర్శనమిస్తున్నాయి. కొనుగోలు చేసిన ధాన్యం తరలించేందుకు లారీలు సక్రమంగా రావడం లేదు. నాలుగు రోజులకు రెండు లారీలు వస్తే ధాన్యం సేతరణ ఏపుడు పూర్తవుతందని రైతులు తమ ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గత శనివారం సాయంత్రం కురిసిన అకాల వర్షానికి ధాన్యం, కాంట పెట్టిన సంచులు తడిచి రైతలకు తల నొప్పిగా మారింది. వర్షంలో ధాన్యం కాపాడుకునేందుకు రైతులు నానా తంటాలు పడ్డారు.

దీంతో ఆగ్రహం చెందిన రైతులు, బీఆర్ఎస్ నాయకులు ఆదివారం తడిచిన ధాన్యం బస్తాలతో రోడ్డుపై బైఠాయించి ధర్నా నిర్వహించారు. గంట సేపు ట్రాఫిక్ అంతరం కలిగింది. సంఘటన స్థలానికి ఎంఆర్వో పుష్పలత చేరుకుని రైతులను సముదాయించగా నెల రోజులుగా కొనుగోలు కేంద్రాల్లో పడిగాపులు గాసిన వడ్లు జోకడం లేదంటు ఆగ్రహం రైతులు ఆగ్రహం వ్యక్తం చేసారు. ఇక ముందు అలా జరుగదు, రోజు నాలుగు లారీలు వచ్చే విదంగా చర్యలు తీసుకుంటామని హామీ ఇవ్వడంతో ధర్నా విరమించారు.



### వరదకు వడ్లు కొట్టుకపోతున్నయి

**ఏస, మహిళా రైతు, రుద్రంగి**

వర్షానికి వరద వచ్చి వడ్లు కొట్టుకపోతున్నయి, వడ్లు తెచ్చి ఇప్పటికి నెల పదిహేను రోజులైతుంది. ఇంకెపుడు వడ్లు కొంటరు, ప్రభుత్వానికి రైతుల బాధ కనపడతులేదా, లారీలు వచ్చెట్టు ప్రభుత్వం చూడాలే ఇంకా ఎన్ని రోజులు ఉంటయి కల్లాల్లో

## నేటి నుండి జనగణన కార్యక్రమం ప్రారంభం

రుద్రంగి, మే10, (ప్రజాకలం ప్రతునిధి)

నేటి నుండి ప్రారంభవుతున్న జనగణన కార్యక్రమంలో భాగంగా రాజన్న సిరిసిల్ల జిల్లా రుద్రంగి ఛార్జ్ ఆఫీసర్ మరియు తహశీల్దార్ శ్రీమతి పుష్పలత మాట్లాడుతూ.. నేటి నుండి వచ్చే నెల 9వ తారీఖు వరకు జరిగే జనగణన దేశ అభివృద్ధికి ఎంతో ముఖ్యమైన కార్యక్రమమని తెలిపారు. ప్రజల సంఖ్య, కుటుంబ వివరాలు, విద్య, ఉపాధి, గృహ పరిస్థితులు వంటి వివరాలను సేకరించడం ద్వారా ప్రభుత్వ పథకాలను మరింత సమర్థవంతంగా అమలు చేయుటకు, మౌలిక సదుపాయాల కల్పనకు మరియు బడ్జెట్ కేటాయింపులకు సహాయపడుతుందని పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో మండలంలోని ప్రతి కుటుంబం జనగణన సిబ్బందికి పూర్తి సహకారం అందించి సరైన సమాచారాన్ని ఇవ్వవలసిందిగా కోరారు. జనగణన సిబ్బంది మీ ఇంటికి వచ్చినప్పుడు ఎలాంటి అపోహలు లేకుండా అవసరమైన వివరాలను సరైన విధంగా తెలియజేయగలరని, అందించిన సమాచారం పూర్తిగా గోప్యంగా ఉంచబడుతుందని తెలిపారు.

జనగణన విజయవంతంగా నిర్వహించుట ప్రతి పౌరుని బాధ్యత అని పేర్కొంటూ, మండల ప్రజలందరూ చురుకుగా పాల్గొని ప్రభుత్వానికి సహకరించి దేశాభివృద్ధికి తోడ్పడవలసిందిగా విజ్ఞప్తి చేశారు.











# యువతకు స్ఫూర్తిగా నిలిచిన దాసరి ఉష కృషి

## -ఎస్.ఎస్.బి కమాండెంట్ ఆశీష్ క్రిష్ణ పటేల్

పెద్దపల్లి,మే10:(ప్రజాకలం జిల్లా ప్రతినిధి)

యువతలో క్రీడా స్ఫూర్తిని రగిలిస్తూ,గత 25 రోజులుగా పెద్దపల్లి నియోజకవర్గ వ్యాప్తంగా జ్యోతిబా ఫూలే–అంబేద్కర్ జై యుగం కప్ క్రికెట్ టోర్నమెంట్ విజయవంతంగా కొనసాగుతుంది. బీసీ జేఏసీ చైర్‌పర్సన్ శ్రీమతి దాసరి ఉష ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఈ మెగా టోర్నీ ఫైనల్ మ్యాచ్ ఆదివారం పెద్దపల్లి మండలంలోని మదర్ థెరిస్సా కాలేజ్ గ్రౌండ్‌లో అత్యంత ఉత్సాహంగా జరిగింది. మండల స్థాయి ఫైనల్ మ్యాచ్‌లో పెద్దకల్వల మరియు కొత్తపల్లి జట్లు హోరాహోరీగా తలపడ్డాయి. మైదానమంతా క్రీడాకారుల కేరింతలు,అభిమానుల కోలాహలంతో సందడిగా మారింది. ఉత్కంఠభరితంగా సాగిన ఈ పోరులో పెద్దకాల్వల జట్టు అద్భుత ప్రదర్శనతో విజేతగా నిలిచి,విన్నర్స్ షీల్డ్‌తో పాటు రూ. 10వేల నగదు బహుమతిని సొంతం చేసుకుంది. రన్నరప్‌గా నిలిచిన కొత్తపల్లి జట్టు షీల్డ్ మరియు రూ. 5వేల నగదును గెలుచుకుంది. ఈ ముగింపు వేడుకకు దాసరి ఉష భర్త ఎస్.ఎస్.బి కమాండెంట్.జుట్టు ఆశీష్ క్రిష్ణ పటేల్ ముఖ్య అతిథిగా హాజరై విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యువత దురలవాట్లకు దూరంగా ఉండి క్రీడల్లో రాణించాలని,అప్పుడే ఆరోగ్యవంతమైన సమాజం సాధ్యమవుతుందని పేర్కొన్నారు. నియోజకవర్గంలోని ప్రతి మండలాన్ని కలుపుతూ గత 25 రోజులుగా ఇంతటి భారీ టోర్నమెంట్‌ను విజయవంతంగా నిర్వహించిన దాసరి ఉష కృషిని ఆయన అభినందించారు. ఈ కార్యక్రమంలో బీసీ జేఏసీ మహిళా కన్వీనర్ సిరవేణ స్వప్న,నర్ల సాయి,సంతోష్,20వ వార్డు కౌన్సిలర్ రాజేష్,ఎస్.సి.సి.ఎల్ కాంట్రాక్టర్ శ్రీనివాస్,అసెంబ్లీ కోఆర్డినేటర్లు భూమేష్,అబ్దుల్ మాలిక్,ఆర్గనైజర్ శ్రావణ్,రాజేందర్,సాగర్,క్రీడా కారులు,తదితరులు పాల్గొన్నారు.



# సర్కారు బడి విజయాల గడి

## -98 మంది ప్రతిభావంతులకు ఎమ్మెల్యే ఘన సన్మానం



పెద్దపల్లి,మే 10 (ప్రజాకలం జిల్లాప్రతినిధి)

ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతూ పదవ తరగతి ఫలితాల్లో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులు భవిష్యత్తులో ఉన్నత శిఖరాలను అధిరోహించాలని తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ విప్,పెద్దపల్లి ఎమ్మెల్యే చింతకుంట విజయరమణ రావు ఆకాంక్షించారు. ఆదివారం పెద్దపల్లి పట్టణంలోని అమర్ చంద్ కళ్యాణ మండపంలో యువజన కాంగ్రెస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ప్రతిభా పురస్కారాల కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. పెద్దపల్లి పట్టణం మరియు మండలంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలల్లో విద్యాభ్యాసం చేసి,పదవ తరగతిలో 500 పైగా మార్కులు సాధించిన 98 మంది విద్యార్థిని విద్యార్థులను ఈ సందర్భంగా ఆయన ఘనంగా సన్మానించారు. విద్యార్థులకు శాలువాలు కప్పి,మెమొంటోలను బహూకరించి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాల విద్యార్థులే రేపటి ఆశాకిరణాలని, పేద విద్యార్థులు కష్టపడి చదివి గొప్ప మార్కులు సాధించడం గర్వకారణమని, ఇదే స్ఫూర్తితో పైచదువుల్లో రాణించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా యువజన కాంగ్రెస్ అధ్యక్షులు బొంకూరి అవినాష్,మున్సిపల్ చైర్మన్,కౌన్సిలర్లు,కాంగ్రెస్ పార్టీ మండల మరియు పట్టణ అధ్యక్షులు,మండల విద్యాధికారి,వివిధ గ్రామాల సర్పంచ్‌లు,ఉపాధ్యాయులు,విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

# ప్రాణం తీసిన ప్రేమ

## -యువతి భర్త చేతిలో వంశీ హత్య

## -మంథని అడవుల్లో గుర్తుపట్టలేనంతగా కుళ్లిన స్థితిలో యువకుడి శవం

పెద్దపల్లి,మే10:(ప్రజాకలం జిల్లా ప్రతినిధి)

పది రోజులుగా గాలిస్తున్న పెద్దపల్లి జిల్లా రామగిరి మండలం సింగిరెడ్డిపల్లికి చెందిన జూల వంశీ అనే దళిత యువకుడి అదృశ్యం కేసు విషాదాంతమైంది. మంథని మండలం గాడిదల గండి సమీపంలో ఆదివారం ఉదయం ఆయన మృతదేహం కుళ్లిన స్థితిలో లభ్యమవ్వడం జిల్లాలో సంచలనం రేపింది. ఏప్రిల్ 30 నుంచి వంశీ కనిపించకపోవడంతో కుటుంబ సభ్యులు గోదావరిఖని టూ టౌన్ పోలీసులకు ఫిర్యాదు చేయగా,విచారణలో దిగ్భ్రాంతి కలిగించే నిజాలు వెలుగులోకి వచ్చాయి. పోలీసుల ప్రాథమిక విచారణ ప్రకారం.. వంశీకి తన గ్రామానికే చెందిన ఓ యువతితో గతంలో ప్రేమ వ్యవహారం ఉండేది. అయితే ఆ యువతి అనంతరం మరొకరిని వివాహం చేసుకుని హైదరాబాద్‌లో నివసిస్తోంది. ఇటీవల గ్రామ దేవతల కొలుపుల సందర్భంగా ఆమె సొంతూరికి వచ్చిన సమయంలో,వీరిద్దరి మధ్య తిరిగి ఫోన్ సంభాషణలు మొదలయ్యాయి. ఈ విషయం గమనించిన యువతి భర్త,వంశీపై కక్ష పెంచుకున్నాడు. పథకం ప్రకారం ఏప్రిల్ 30న భార్యతోనే ఫోన్ చేయించి వంశీని హైదరాబాద్‌కు పిలిపించిన భర్త,అక్కడే అతడిని హతమార్చాడు. అనంతరం ఎవరికీ అనుమానం రాకుండా మృతదేహాన్ని మంథని సమీపంలోని గాడిదల గండి అటవీ ప్రాంతంలో పడేశాడు. వంశీ కాల్ డేటా ఆధారంగా పోలీసులు సదరు యువతిని,ఆమె భర్తను విచారించగా ఈ ఘోరం బయటపడింది. హత్య జరిగి పది రోజులు కావడంతో మృతదేహం గుర్తుపట్టలేనంతగా కుళ్లిపోయింది. పోలీసులు మృతదేహాన్ని స్వాధీనం చేసుకుని పంచనామా నిర్వహించారు. పాత ప్రేమ వ్యవహారమే ఈ హత్యకు దారితీసినట్లు పోలీసులు నిర్ధారించి,కేసు నమోదు చేసి లోతుగా దర్యాప్తు చేస్తున్నారు.



## వివాహ వేడుకలకు హాజరైన మాజీ ఎంపీపీ పోనుగోటి శ్రీనివాసరావు

ఎండపల్లి, మే 10 : ( ప్రజా కలం ప్రతినిధి )

కరీంనగర్ రూరల్ మండల ఎంపీడీఓ గా విధులు నిర్వహిస్తున్న ఆకుల సంజీవ రావు సుపుత్రుడి వివాహ వేడుకకు వెల్గటూర్ మాజీ ఎంపీపీ పొనుగోటి శ్రీనివాస్ రావు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. నవ దంపతులను ఆశీర్వదించి వారికి వివాహ శుభాకాంక్షలు తెలియజేస్తూ వారి వైవాహిక జీవితం సుఖ సంతోషాలతో వర్ధిల్లాలని ఆకాంక్షించారు. ఈ వేడుకలో సర్పంచులు, రాజారాంపల్లి గ్రామ సర్పంచ్ సంఘ రమేష్ యాదవ్, గుల్లకోట గ్రామ సర్పంచ్ గొల్లపెల్లి మల్లేష్ గౌడ్, జాడి రాజేశం, నక్క లక్ష్మణ్ యాదవ్, శ్రీనివాస్, కాట్నపల్లి శ్రీనివాస్ శర్మ, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, పాల్గొన్నారు.



# మద్యానికి బానిసై తిండి తినక రాత్రి పడుకున్న వ్యక్తి నిద్రలోనే మృతి

## -వెంకటేష్ మృతిపై ఎవరి మీద అనుమానం లేదని తల్లి ఫిర్యాదు

## -సంఘటన స్థలాన్ని సందర్శించిన డి.ఎస్.పి పురుషోత్తం రెడ్డి, ధర్మపురి సిఐ ఎలపాటి రామ్ నరసింహారెడ్డి

## -శవ పంచనామా నిర్వహించి మృతుడి శవం ను అంత్య క్రియల నిమిత్తం తల్లికి అప్పగింత

వెల్గటూర్, మే 10 : ( ప్రజా కలం ప్రతినిధి )

దండేపల్లి మండలం నర్సపురం గ్రామానికి చెందిన కొయ్యాడ వెంకటేష్ తండ్రి లచ్చన్న వయస్సు ( 45 ) సంవత్సరాలు గౌడ్ కులం అను అతడు చాలా సంవత్సరాలుగా మద్యానికి బానిసైనాడని ప్రతిరోజు మద్యం తాగేవాడని అలాగే ఒక వారం రోజు నుంచి ప్రతి రోజు ఎలాంటి ఆహారం తీసుకోకుండా మద్యం తాగుతున్నాడని తను ఎంత చెప్పినా అన్నం తినలేదని చెప్పి అయితే తేదీ 9.05.2026 శనివారం రోజున రాత్రి సమయం లో తన కొడుకు కొయ్యాడ వెంకటేష్ వెల్గటూర్ మండలం లోని జగదేవ్ పేట గ్రామం లో గల తమ బంధువైన అమరగొని వెంకటేష్ నివాసానికి వచ్చి ఎలాంటి ఆహారం తీసుకోకుండా మద్యం తాగి పడుకున్నాడని ఆదివారం రోజున ఉదయం సమయాన తన కొడుకును నిద్ర లేపుదామని అమరగోని వెంకటేష్ ప్రయత్నించగా తన కొడుకు మరణించి ఉన్నాడు

అని చెప్పి తన కొడుకు ఎలాంటి ఆహారం తీసుకోకుండా మద్యం తాగడం వల్ల అనారోగ్యానికి గురి అయ్యి చనిపోయాడని అతని మృతి పై ఎవరి మీద ఎలాంటి అనుమానం లేదని అతని తల్లి అయిన కొయ్యాడ నరసవ్వ ఇచ్చిన ఫిర్యాదు మేరకు వెల్గటూర్ ఎస్సై పులిచెర్ల ఉదయ్ కుమార్ కేసు నమోదు చేసి శవ పంచనామా నిర్వహించి, పోస్టుమార్టం అనంతరం మృతుడి శవంను మృతుడి తల్లికి అంత్యక్రియల నిమిత్తం అప్పజెప్పినారు. ఇట్టి సంఘటన స్థలాన్ని జగిత్యాల డిఎస్ పి కె పురుషోత్తశీ రెడ్డి, ధర్మపురి సీఐ రామ్ నరసింహ రెడ్డి, సందర్శించినారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పులిచెర్ల ఉదయ్ కుమార్ తెలిపారు.



# ఆర్‌ఎఫ్‌సిఎల్ కార్మికుల పక్షాన నిలిచిన సర్కార్

## -మంత్రి శ్రీధర్ బాబు,ఎమ్మెల్యే రాజ్ ఠాకూర్ చొరవతో సఫలమైన చర్చలు



పెద్దపల్లి,మే10:(ప్రజాకలం జిల్లాప్రతినిధి)

పెద్దపల్లి జిల్లా రామగుండం ఎరువుల కర్మాగారంలో గత రెండు రోజులుగా నెలకొన్న సమ్మె ఉత్కంఠకు తెరపడింది. ఎమ్మెల్యే ఎం.ఎస్ రాజ్ ఠాకూర్ ప్రత్యేక చొరవతో ఈ సమస్య కొలిక్కి వచ్చింది. ఆదివారం హైదరాబాద్‌లోని తాజ్ కృష్ణ హోటల్‌లో రాష్ట్ర ఐటీ శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు సమక్షంలో ఆర్.ఎఫ్.సి.ఎల్ యాజమాన్యంతో నిర్వహించిన చర్చలు సఫలమయ్యాయి. న్యూఢిల్లీ నుంచి వచ్చిన సంస్థ సీఈఓ సంజయ్ గులాటి మరియు ఇతర ఉన్నతాధికారులతో మంత్రి శ్రీధర్ బాబు,ఎమ్మెల్యే రాజ్ ఠాకూర్ కార్మికుల డిమాండ్లపై చర్చించగా,యాజమాన్యం సానుకూలంగా స్పందించి అంగీకారం తెలిపింది. ఈ చర్చల్లో భాగంగా కుదిరిన ఒప్పందాన్ని పెద్దపల్లి జిల్లా కలెక్టర్ సమక్షంలో లిఖితపూర్వకంగా జరుపుకోవాలని నిర్ణయించారు.

ఈ సందర్భంగా ఎమ్మెల్యే రాజ్ ఠాకూర్ మాట్లాడుతూ అభివృద్ధి చేయడమే కాకుండా,ప్రజల సమస్యలను పరిష్కరించడమే తన ప్రథమ లక్ష్యమని స్పష్టం చేశారు. కార్మికులకు,నిరుపేదలకు తన చివరి శ్వాస వరకు అండగా ఉంటానని భరోసా ఇచ్చారు. ఎన్నో రోజులుగా వివాదాలతో ఇబ్బంది పడుతున్న కాంట్రాక్ట్ కార్మికులకు ఈ ఒప్పందం పెద్ద ఊరటనిచ్చిందన్నారు. ఈ కార్యక్రమంలో రా.ఏ.డబ్ల్యూ.సి యూనియన్ నాయకులు, 38వ డివిజన్ కార్పొరేటర్ నెలకంటి రాము,కాంగ్రెస్ పార్టీ ముఖ్య నాయకులు, ఆర్.ఎఫ్.సి.ఎల్ ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

# భారీగా రేషన్ బియ్యం పట్టివేత

## హైదరాబాద్ టు మహారాష్ట్ర..రూ.13 లక్షల విలువైన రేషన్ బియ్యం సీజ్

పెద్దపల్లి,మే10 (ప్రజాకలం జిల్లాప్రతినిధి)

పేదల బియ్యం సరిహద్దులు దాటుతుండగా పెద్దపల్లి పోలీసులు, సివిల్ సప్లై అధికారులు చాకచక్యంగా పట్టుకున్నారు. హైదరాబాద్ నుండి మహారాష్ట్రలోని గొండియాకు లారీలో అక్రమంగా తరలిస్తున్న సుమారు 298.10 క్వింటాళ్ల ప్రభుత్వ పంపిణీ బియ్యాన్ని ఆదివారం రంగంపల్లి వద్ద అధికారులు స్వాధీనం చేసుకున్నారు. పెద్దపల్లి పట్టణ పోలీసులు వెల్లడించిన వివరాల ప్రకారం..రేషన్ బియ్యం అక్రమ రవాణా జరుగుతుందన్న సమాచారంతో సివిల్ సప్లై అధికారులు,టాస్క్ ఫోర్స్ సిబ్బంది సంయుక్తంగా రంగంపల్లి వద్ద తనిఖీలు చేపట్టారు. ఈ క్రమంలో అనుమానాస్పదంగా వస్తున్న లారీని ఆపి తనిఖీ చేయగా, అందులో భారీ మొత్తంలో రేషన్ బియ్యం నిల్వలు బయటపడ్డాయి. వీటి విలువ సుమారు 13,66,490 రూపాయలు ఉంటుందని అధికారులు అంచనా వేశారు. ఈ ఘటనపై సివిల్ సప్లై డిప్యూటీ తహసీల్దార్ గోపిడి రవీందర్ ఫిర్యాదు మేరకు,లారీ డ్రైవర్ మహాదేవ్‌తో పాటు,బియ్యాన్ని తరలించాలని ఆదేశించిన ప్రేమ్ కుమార్‌పై పెద్దపల్లి టౌన్ పోలీసులు కేసు నమోదు చేశారు. అక్రమ రవాణాకు వినియోగించిన లారీని సీజ్ చేసి,నిందితులపై తదుపరి దర్యాప్తు కొనసాగిస్తున్నట్లు పోలీసులు తెలిపారు.



# ప్రజాస్వామ్య పరిరక్షనే టీజేఎస్ లక్ష్యం

## ఇబ్రహీంపట్నం మండల అధ్యక్షుడు కంతి రమేష్...

ఇబ్రహీంపట్నం మే 10 (ప్రజా కలం ప్రతినిధి )

ఇబ్రహీంపట్నం మండలం కేంద్రంలో ప్లీనరీ పోస్టర్‌ను పార్టీ నాయకులు మరియు కార్యకర్తలు ఘనంగా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ, తెలంగాణ ప్రజల ఆకాంక్షల కోసం, ప్రజాస్వామ్య విలువల రక్షణ



కోసం నిరంతరం పోరాడుతున్న తెలంగాణ జన సమితి, తన 4వ ప్లీనరీని హైదరాబాదులోని జలవిహార్ లో అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తోందని తెలిపారు. రాబోయే రోజుల్లో ప్రజా సమస్యలపై పార్టీ చేపట్టబోయే పోరాట కార్యాచరణను ఈ సమావేశాల్లో ఖరారు చేయనున్నట్లు పేర్కొన్నారు.
తెలంగాణ జన సమితి సిద్ధాంతాలనుప్రజల్లోకితీసుకెళ్లడమే ఈ ప్లీనరీ ప్రధాన ఉద్దేశ్యం.నియోజకవర్గ వ్యాప్తంగా ఉన్న పార్టీ కార్యకర్తలు, మేధావులు మరియు ప్రజలు ఈ సమావేశాల్లో పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.రైతు, నిరుద్యోగ మరియు సామాజిక సమస్యల పరిష్కారం దిశగా పార్టీ గళాన్ని మరింత బలోపేతం చేస్తామని ఈ సందర్భంగా నాయకులు ప్రతిజ్ఞ చేశారు.ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షుడు కంతి రమేష్, మండల కార్యదర్శి కలాల ప్రవీణ్, ఎండి సలీం, గోవర్ధన్, లాడే రాజు, నాస్పెల్లి వినయ్, శ్యా మ్, శివ, రాకేష్, మరియు పార్టీకి చెందినఇతరముఖ్యనాయకులు,కార్యకర్తలు పాల్గొని ప్లీనరీ విజయవంతానికితమసంఘీభావాన్ని ప్రకటించారు..

# రత్నాకర్ రావుకు ఘన నివాళి

మెట్ పల్లి:(కోరుట్ల) ప్రతినిధి మే10(ప్రజా కలం) ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ మంత్రి దివంగత జువ్వాడి రత్నాకర్ రావు 6 వ వర్ధంతి సందర్భంగా మెట్ పల్లి పట్టణం లోని జువ్వాడి భవన్ లో జువ్వాడి రత్నాకర్ రావు చిత్రపటానికి తెలంగాణ



రాష్ట్ర వెలమ కార్పొరేషన్ చైర్మన్. కోరుట్ల నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ జువ్వాడి నర్సింగ్ రావు పూలమాలల వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఉమ్మడి రాష్ట్ర మంత్రిగా చేసిన సేవలు కొనియాడుతూ కోరుట్ల నియోజకవర్గ అభివృద్ధికి ఎనలేని కృషి చేశారని వివరించారు. ఇంకా ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# విద్య వారోత్సవ వేడుకలను విజయవంతం చేయండి – ప్రిన్సిపాల్ పిలుపు

మెట్ పల్లి:(కోరుట్ల) ప్రతినిధి మే 10 (ప్రజా కలం) తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న ప్రజాపాలన – ప్రగతి ప్రణాళిక – 99 రోజుల కార్యక్రమంలో భాగంగా ఈ నెల 11 వ తేదీ నుంచి విద్యా శాఖ ఆధ్వర్యంలో విద్య వారోత్సవాలను నిర్వహిస్తున్న నేపథ్యంలో ఈ వేడుకలను విజయవంతం చేయాలని ప్రిన్సిపాల్ వేంకయ్య పిలుపునిచ్చారు. జగిత్యాల జిల్లా మెట్ పల్లి పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ ఛాంబర్ లో ఆదివారం బోధన, బోధనేతర సిబ్బంది సమక్షంలో విద్య వారోత్సవ వేడుకల నిర్వహణ కోసం ప్రత్యేక సమావేశం జరిగింది. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ మాట్లాడుతూ, ఏడు రోజుల పాటు జరుగనున్న విద్య వారోత్సవ వేడుకలలో భాగంగా కళాశాల స్థాయిలో ప్రజా పాలన, ప్రగతి–ప్రణాళిక బ్యానర్,బ్రౌచర్ ల ఆవిష్కరణ,పోస్ట్ గ్రాడ్యుయేషన్ లో విద్యార్థులకు శిక్షణ,అదే విధంగా ప్రజాప్రతినిధులతో సమావేశం నిర్వహణ,తల్లిదండ్రుల సమావేశం నిర్వహణ,గ్రంథాలయ పుస్తక ప్రదర్శన,కృత్రిమ మేధస్సుతో పాటు నూతన ఆవిష్కరణలకు ప్రోత్సాహం, అర్హత గల విద్యార్థులకు, కళాశాల అభివృద్ధికి సహకరించిన దాతలకు సన్మానం వంటి కార్యక్రమాలను నిర్వహించాలని ఆయన వివరించారు. ఈ సమావేశంలో కళాశాల అకాడమిక్ కో– ఆర్డినేటర్ బిల్ల రాజేందర్, దోస్త్ కో– ఆర్డినేటర్ ఏ. మనోజ్ కుమార్, కామర్స్ లెక్చరర్ ఏ.అంజయ్య, బోధనేతర సిబ్బంది జుంబర్తి లక్ష్మీనారాయణ, అటుకుల బాబు, వై.శ్రీనివాస్, గొర్రె లింగం తదితరులు పాల్గొన్నారు.






# మహిళా లోకానికి 'భూమి' భరోసా

## -మాతృ దినోత్సవం వేళ మహిళల ఆత్మీయ కలయిక

## -భూమి ఫౌండేషన్ ఆవిష్కరణ

పెద్దపల్లి,మే 10 (ప్రజాకలం జిల్లాప్రతినిధి)

మహిళల ఆత్మగౌరవాన్ని పెంపొందిస్తూ,వారిని ఆర్థికంగా, సామాజికంగా బలోపేతం చేయడమే లక్ష్యంగా పెద్దపల్లి జిల్లా కేంద్రంలో భూమి ఫౌండేషన్ అంకురార్పణ జరిగింది.మున్సిపాలిటీ పరిధిలోని 10వ వార్డు లక్ష్మీ నగర్ మహిళలందరూ కలిసి మాతృ దినోత్సవం సందర్భంగా ఈ స్వచ్ఛంద సంస్థను ఆదివారం ఘనంగా ప్రారంభించారు.ఈ ఆవిష్కరణ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న విశ్రాంత ప్రధాన ఉపాధ్యాయురాలు ఈర్ల శోభారాణి మాట్లాడుతూ మహిళలు కేవలం గృహిణులుగానే కాకుండా సమాజ నిర్మాణంలో భాగస్వాములు కావాలని ఆకాంక్షించారు. మహిళా స్వేచ్ఛ,గౌరవం,ఆర్థిక స్వాలంబనే ధ్యేయంగా ఈ ఫౌండేషన్ అడుగులు వేయబోతుందని తెలిపారు.సమాజంలో ఏ మహిళకైనా ఆపద లేదా సమస్య ఎదురైనప్పుడు భూమి ఫౌండేషన్ ముందుండి అండగా నిలుస్తుందని ,చేయూతనిస్తుందని ఆమె స్పష్టం చేశారు.మహిళలు ప్రతి రంగంలోనూ అభివృద్ధి సాధించి,ఇతర మహిళలకు ఆదర్శంగా నిలవాలని ఈ సందర్భంగా పిలుపునిచ్చారు.అనంతరం మాతృమూర్తుల గొప్పతనాన్ని కొనియాడుతూ కార్యక్రమంలో పాల్గొన్న మహిళలు,మాతృ మూర్తులకు శాలువాలతో ఘనంగా సన్మానం చేశారు.ఒకరికొకరు శుభాకాంక్షలు తెలుపుకుంటూ పంచుకున్న ఆత్మీయ పలకరింపులు అక్కడి వారిని అలరించాయి.

ఈ కార్యక్రమంలో మంథని ఏడీఏ అంజని,గెజిటెడ్ ఉపాధ్యాయులు శోభారాణి,జానకి,ఉపాధ్యాయురాలు విజయరాణి,మహిజతో పాటు లక్ష్మీ నగర్ మహిళా ప్రతినిధులు ప్రసన్న లక్ష్మీ,రాంబాబు,ఉమాదేవి,జ్యోతి,స్వరూప,మంజులత, రజిత,లక్ష్మీ,మనోజ,జానకి దేవి,ముంతాజ్ బేగం,ఖాజాబీ,వసంత, రమ,మంజుల,పద్మ,దీప తదితరులు పాల్గొన్నారు.

# సాముహిక శ్రీమంతాల కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే తలసాని

హైదరాబాద్ : నవ మాసాలు కడుపులో మోసి, కని పెంచి పెద్ద చేసే తల్లి ప్రేమ, త్యాగం ఎంతో గొప్పదని మాజీమంత్రి, సనత్ నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ అన్నారు. గురువారం సనత్ నగర్ లోని ఆదిత్య నగర్ కమిటీ హాల్ లో శ్రీ మాతా సేవా సమితి ఆధ్వర్యంలో నిర్వహించిన సామూహిక శ్రీమంతాలు కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా 35 మంది గర్భిణీలకు పండ్లు, పౌష్టికాహారం అందజేసి ఆశీర్వదించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మదర్స్ డే సందర్భంగా ఇంత గొప్ప కార్యక్రమం నిర్వహించిన కుసుమ విజయ ను అభినందించారు. శ్రీ మాతా సేవా సమితి ఆధ్వర్యంలో వైద్య శిబిరాలు, మహిళలకు, కుట్టు శిక్షణ, సామూహిక శ్రీమంతాలు వంటి విభిన్న కార్యక్రమాలు నిర్వహించడం సంతోషదాయకం అన్నారు. ఈ కార్యక్రమాల నిర్వహణ అంతా డబ్బుతో ముడి పడి ఉన్నాయని, నా సహాయ సహకారాలు ఉంటాయని ప్రకటించారు. గర్భిణీ లకు వారి వారి కుటుంబ సభ్యులు శ్రీమంతం నిర్వహించడం ఆనవాయితీగా వస్తుందని, కానీ పేదరికం వలన నిర్వహించుకోలేకపోతున్న వారికి ఈ కార్యక్రమం సంతోషాన్ని ఇస్తుందని చెప్పారు. తల్లిదండ్రులకు ప్రత్యేక గౌరవ మర్యాదలు ఇవ్వాల్సిన అవసరం ఉందని, వెస్టన్ కల్చర్ కు అలవాటు పడి తమ బిడ్డను మంచి ప్రయోజకుడిని చేయాలని తాపత్రయ పడే తల్లిదండ్రులను కొంతమంది నిర్లక్ష్యం చేస్తున్నారని విచారం వ్యక్తం చేశారు. మన సంస్కృతి సాంప్రదాయాలను కాపాడటంలో కూడా తల్లుల పాత్ర ఎంతో ఉందని అన్నారు. ప్రపంచ దేశాలు మన సంస్కృతి, సాంప్రదాయాలను ఎంతో గొప్పగా ఆచరిస్తుంటే మన వద్ద పాటించకపోవడం బాధాకరం అన్నారు. మన పండుగల విశిష్టత కూడా నేటితరం పిల్లలకు తెలవదని, తెలియజెప్పాల్సిన అవసరం ఉందని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన తర్వాత ప్రజలకు కష్టాలు మొదలయ్యాయని మండిపడ్డారు. పదేళ్ల కేసీఆర్ ప్రభుత్వం లో ఏ రోజు లేని విద్యుత్ సమస్య, త్రాగు నీటి సమస్య ఇప్పుడు ఎందుకు వచ్చిందని అన్నారు. కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ కొలన్ లక్ష్మీ, బి ఆర్ ఎస్ పార్టీ డివిజన్ అధ్యక్షుడు కొలన్ బాల్ రెడ్డి, సమితి సభ్యులు లావణ్య, శోభారాణి, వెంకట నర్సమ్మ, కృష్ణమూర్తి, నాయకులు సురేష్ గౌడ్, కరుణాకర్ రెడ్డి, ప్రవీణ్ రెడ్డి, బాలరాజ్, షాబాద్ శ్రీనివాస్, ఖలీల్, ఆకుల రాజు, పీయూష్ గుప్తా తదితరులు పాల్గొన్నారు.

# మామిడి రైతుల ఆవేదనను పట్టించుకోని కూటమి ప్రభుత్వం

తుగ్గలి: మామిడి రైతుల ఆవేదనను కూటమి ప్రభుత్వం పట్టించుకోవడంలేదని పత్తికొండ మాజీ ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి తెలియజేశారు. గురువారం రోజున తుగ్గలి మండల పరిధిలోని గల నునుసురాళ్ల గ్రామం నందు మండల వైసీపీ నాయకుల, గ్రామ రైతుల ఆధ్వర్యంలో మామిడి తోటలను ఆమె పరిశీలించారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మామిడి తోట పైన ఆధారపడి జీవిస్తున్న రైతులు గిట్టుబాటు ధర లేక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆమె తెలియజేశారు.అకాల వర్షాలకు, గాలులకు చాలావరకు మామిడి పంటలు పూర్తిగా దెబ్బతిన్నాయని ఆమె తెలియజేశారు.మామిడి పంట సాగుకు ఎకరాకు ఒక లక్ష పెట్టుబడి వస్తుందని,మామిడి పంటకు సరైన ధర లేక మామిడి రైతులు అప్పుల పాలవుతున్నారని తెలియజేశారు. కూటమి ప్రభుత్వం తక్షణమే మామిడి రైతులను ఆదుకొని,ఒక బాక్స్ 2000 రూపాయలు చొప్పున మద్దతు ధర ప్రకటించాలని ఆమె ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.కేంద్ర మరియు రాష్ట్ర ప్రభుత్వాలు మామిడి పంటను ఎగుమతులు చేయడం ద్వారా మామిడి పంటకు మంచి ధర వస్తుందని ఆమె తెలియజేశారు.ఈ ప్రభుత్వాలు మామిడి పంట ఎగుమతులను పూర్తిగా నిలిపివేయడంతో మామిడి పంట ధర పూర్తిగా పతనమైందని ఆమె తెలియజేశారు.రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏర్పడినప్పటి నుండి రైతులకు ఏ పథకాలు సరిగ్గా అందడం లేదని ఆమె తెలియజేశారు.రైతులకు గిట్టుబాటు ధర,ఇన్సూరెన్స్ వంటివి రైతులకు అందరిని ద్రాక్షలాగా ఉన్నాయన్నారు.అదేవిధంగా మొక్కజొన్న రైతులకు కూడా సరైన మద్దతు ధర లేక ఆత్మహత్యలకు పాల్పడుతున్నారని ఆమె తెలియజేశారు.కూటమి ప్రభుత్వంలో రైతుల పరిస్థితి చాలా ఘోరంగా ఉందని ఆమె తెలియజేశారు.వైయస్ రాజశేఖర్ రెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్న కాలంలో మరియు వైయస్ జగన్మోహన్ రెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్న కాలంలో రైతే రాజుగా వ్యవసాయానికి పెద్దపీట వేశారని ఆమె తెలియజేశారు. ఇప్పటికైనా కూటమి ప్రభుత్వం మామిడి రైతులను ఆదుకొని గిట్టుబాటు ధర కల్పించాలని ఆమె తెలియజేశారు.లేనిపక్షంలో మామిడి రైతులతో కలిసి పెద్ద ఎత్తున ధర్నాలు నిర్వహిస్తామని ఆమె ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షులు జిట్టా నాగేష్, మండల అధ్యక్షుడు గోపాల్ రెడ్డి,వైసిపి రైతు విభాగం రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాసరెడ్డి,గ్రీవెన్స్ సెల్ రాష్ట్ర కార్యదర్శి రామచంద్రా రెడ్డి,మాజీ జడ్పీటిసి పగిడిరాయి జగన్నాథరెడ్డి, మేధావుల ఫోరం జిల్లా ప్రధాన కార్యదర్శి రాతన మోహన్ రెడ్డి, నునుసురాళ్ల మాజీ సర్పంచ్ గోపాల్ రెడ్డి,రంగారెడ్డి,శ్రీనివాసరెడ్డి,ప్రతాపరెడ్డి, రమణారెడ్డి,శభాష్ పురం రాఘవరెడ్డి, ముక్కెళ్ల లక్ష్మణస్వామి,నునుసురాళ్ల గ్రామ రైతులు,మామిడి రైతులు, వైఎస్ఆర్సిపి నాయకులు,కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# తెలంగాణ వ్యాప్తంగా హైడ్రా విస్తరణకు ప్రభుత్వం నిర్ణయం

హైదరాబాద్ : తెలంగాణ అంతటా హైడ్రాను విస్తరించాలని ప్రభుత్వం నిర్ణయం తీసుకున్నట్లు సమాచారం. ఈ విషయాన్ని హైడ్రా కమిషనర్ రంగనాథ్ వెల్లడించారు. రాష్ట్రవ్యాప్తంగా హైడ్రాకు వినతులు వస్తున్నాయని.. ఈ నేపథ్యంలో హైడ్రా పరిధిని రాష్ట్రమంతటా విస్తరించాలని నిర్ణయించినట్లు వివరించారు. గురువారం నల్గొండ జిల్లాలో పర్యటించిన హైడ్రా కమిషనర్.. ఈ విషయాన్ని వెల్లడించారు. ఇప్పటి వరకూ కోట్ల విలువైన భూములను కబ్జాదారుల చెర నుంచి హైడ్రా కాపాడినట్లు వివరించారు రాష్ట్రవ్యాప్తంగా హైడ్రాను విస్తరించాలని.. తెలంగాణ సర్కారు నిర్ణయం తీసుకున్నట్లు తెలిసింది. ఈ విషయాన్ని హైడ్రా కమిషనర్ రంగనాథ్ స్వయంగా వెల్లడించారు. నల్గొండ జిల్లా మిర్యాలగూడలో రంగనాథ్ గురువారం పర్యటించారు. ఈ సందర్భంగా విలేకర్లతో మాట్లాడిన ఆయన.. రాష్ట్రవ్యాప్తంగా హైడ్రా సేవలు విస్తరించాలంటూ ప్రజల నుంచి వినతులు ఎక్కువగా వస్తున్నాయని రంగనాథ్ అన్నారు. ఈ నేపథ్యంలో హైడ్రాను రాష్ట్రమంతా విస్తరించాలని ప్రభుత్వం నిర్ణయం తీసుకుందని వెల్లడించారు. హైడ్రాకు కబ్జాలపై వేలాదిగా ఫిర్యాదులు వస్తున్నాయని.. ఆ సమస్యలను పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు వివరించారు.ఈ క్రమంలోనే నాలుగు వారాలు ప్రజావాణిని రద్దు చేస్తూ నిర్ణయం తీసుకున్నట్లు హైడ్రా కమిషనర్ రంగనాథ్ తెలిపారు. హైడ్రాకు ఇప్పటికే చాలా ఫిర్యాదులు, దరఖాస్తులు వచ్చాయని వాటిని పరిష్కరించడం



# లోత్తునూర్ గ్రామంలో హిందూ సమ్మేళన కార్యక్రమం

గొల్లపల్లి మే 10 ప్రజా కలం ప్రతినిధి గొల్లపల్లి మండలం లోత్తునూరు గ్రామంలో హిందూ సమ్మేళన కమిటి వేణుగుమట్ల ఉపమండలం ఆధ్వర్యంలో హిందూ సమ్మేళనం కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వక్తలు పాలెపు చంద్రశేఖర్ శర్మ, ఎన్నమనేని అశోక్ రావు,గుండు స్రవంతి మాట్లాడుతూ మన ఈ జీవన విధానంలో మన సంస్కృతి,సాంప్రదాయాలు, కట్టబాట్లు,కుటుంబ వ్యవస్థ పై ప్రజలకు అవగాహన కల్పించారు.మన సనాతన ధర్మ వైభవాన్ని చాటిచెప్పడానికి హిందూ సమాజంలో ఐక్యతను పెంపొందించుకోవాలని ధర్మ సంరక్షణ దిశగా అడుగులు వేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ ఆకుల సుమన్ గౌడ్,ఉప సర్పంచ్ ఒరగంటి మల్లేష్,బోనాల లక్ష్మి కాంతం,కట్ట సుమన్ వార్డు సభ్యులు గ్రామ ప్రజలు,మహిళలు తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా రత్నాకర్ రావు వర్ధంతివేడుకలు

ఇబ్రహీంపట్నం మే 10 (ప్రజా కలం ప్రతినిధి )

ఇబ్రహీంపట్నం మండలం కేంద్రంతో పాటు అన్ని గ్రామాలలో



మాజీమంత్రివర్యులు జువ్వాడి రత్నాకర్ రావు వర్ధంతి వేడుకలు మండలములోని గ్రామాలలో ఘనంగా వర్ధంతి వేడుకలు నిర్వహించారు. డబ్బా గ్రామంలో కాంగ్రెస్ సీనియర్ నాయకుడు బుస రాజేశ్వర్ ఆధ్వర్యంలో జువ్వడి రత్నాకర్ రావు వర్ధంతి వేడుకలు ఘనంగానిర్వహించారు ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు ఈ కార్యక్రమంలో వ్యవసాయ మార్కెట్ వైస్ చైర్మన్ ఏలాల వెంకట్ రెడ్డి మాజీ సర్పంచ్ లింగంపల్లి గంగాధర్. గంగాధర్.తేలు నరేష్. తేలు రమేష్. నరేందర్. పెద్ద సాయన్న. జానాశంకర్. తదితరులు పాల్గొన్నారు.

# విద్యార్థులకు రేవంత్ సర్కార్ తీపి కబురు

## - బోధన రుసుముల చెల్లింపులపై కీలక నిర్ణయం

హైదరాబాద్ :తెలంగాణ ప్రభుత్వం విద్యా రంగంలో కీలక సంస్కరణలకు శ్రీకారం చుట్టింది. 2026–27 విద్యాసంవత్సరం నుంచి ఫీజు రీయింబర్స్‌మెంట్ చెల్లింపుల్లో కొత్త విధానాన్ని అమలు చేయనుంది. ముందుగా దరఖాస్తు చేసుకున్న విద్యార్థులకే నిధుల విడుదలలో ప్రాధాన్యత ఇవ్వడంతో పాటు, ఏ ఏడాది ఫీజులు ఆ ఏడాదే చెల్లించేలా ఎస్సీ సంక్షేమ శాఖ ప్రతిపాదనలు సిద్ధం చేసింది.
మరోవైపు.. విద్యా వ్యవస్థలో సంస్కరణల నేపథ్యంలో ఇంటర్ అడ్మిషన్ల షెడ్యూల్‌ను బోర్డు తాత్కాలికంగా రద్దు చేసింది.తెలంగాణ రాష్ట్ర విద్యా వ్యవస్థలో సమూల మార్పులు తీసుకొచ్చే దిశగా ప్రభుత్వం అడుగులు వేస్తోంది. ముఖ్యంగా ఏళ్ల తరబడి పెండింగ్‌లో ఉంటున్న ఫీ రియంబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్‌ల పంపిణీలో పారదర్శకత, వేగం పెంచేందుకు 2026–27 విద్యాసంవత్సరం నుండి కొత్త విధానాన్ని తీసుకురాబోతోంది. ఇందుకోసం సంక్షేమ శాఖల నోడల్ విభాగమైన ఎస్సీ సంక్షేమ శాఖ పలు కీలక ప్రతిపాదనలను సిద్ధం చేసింది. ఈ కొత్త విధానం ప్రకారం ఫస్ట్ కమ్ – ఫస్ట్ సర్వ్ పద్ధతిలో అంటే ఎవరు ముందుగా దరఖాస్తు చేసుకుంటే వారికే నిధుల విడుదలలో తొలి ప్రాధాన్యత లభిస్తుంది.ప్రస్తుతం అమల్లో ఉన్న విధానం ప్రకారం.. ఒక విద్యాసంవత్సరానికి సంబంధించిన ఫీజులను మరుసటి ఏడాది చెల్లించే ఆనవాయితీ ఉంది. దీనివల్ల విద్యార్థులు, కళాశాల యాజమాన్యాలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయి. దీనిని అధిగమించేందుకు ఇకపై ఏ విద్యాసంవత్సరానికి సంబంధించిన ఫీజులను అదే ఏడాదిలో పూర్తి చేయాలని ప్రభుత్వం యోచిస్తోంది. ఏటా సుమారు రూ. 2,300 కోట్ల నుంచి రూ. 2,400 కోట్ల వరకు ఉండే ఈ నిధులను ఒకేసారి విడుదల చేయాలా? లేక విడతల వారీగా ఇవ్వాలా? అనే అంశంపై స్పష్టమైన టైమ్ షెడ్యూల్‌ను ప్రభుత్వం ప్రకటించనుంది. విద్యార్థుల నుంచి ఫీజులు వసూలు చేయవద్దని హైకోర్టు ఇచ్చిన ఉత్తర్వుల నేపథ్యంలో.. అడ్మిషన్లు ప్రారంభమయ్యేలోపే ప్రభుత్వం దీనిపై పూర్తి స్పష్టత ఇవ్వనుంది.ఇదిలా ఉండగా.. తెలంగాణ ఇంటర్మీడియట్ విద్యా మండలి విద్యార్థులకు షాక్ ఇస్తూ అడ్మిషన్ల షెడ్యూల్‌ను తాత్కాలికంగా రద్దు చేసింది. మే 4న విడుదల చేసిన అడ్మిషన్ల సర్క్యులర్‌ను తక్షణమే ఉపసంహరించుకుంటున్నట్లు బోర్డు కార్యదర్శి ప్రకటించారు. రాష్ట్ర విద్యాశాఖ కొన్ని కీలక సంస్కరణలు ప్రవేశపెట్టాలని భావిస్తున్నందున.. పాత షెడ్యూల్‌ను నిలిపివేసి కొత్త మార్గదర్శకాలను రూపొందిస్తున్నట్లు సమాచారం. అడ్మిషన్ల ప్రక్రియలో మరింత పారదర్శకత తీసుకురావడమే ఈ మార్పుల వెనుక ఉన్న ప్రధాన ఉద్దేశమని తెలుస్తోంది.ఈ ఉత్తర్వులు రాష్ట్రంలోని అన్ని ప్రభుత్వ, ప్రైవేట్, ఎయిడెడ్, గురుకుల, మోడల్ జూనియర్ కళాశాలలకు వర్తిస్తాయని చెప్పింది. తదుపరి ఆదేశాలు వచ్చే వరకు ఎటువంటి అడ్మిషన్లు నిర్వహించకూడదని బోర్డు కఠిన ఆదేశాలు జారీ చేసింది.

## భార్య పుట్టింట్లో బంగారు ఆభరణాల

# చోరీకి పాల్పడిన భర్త అరెస్ట్

గుంటూరు : చేబ్రోలు పోలీస్ స్టేషన్ పరిధిలోని వేజెండ్ల గ్రామానికి చెందిన సాతర్ల తిరుపతమ్మ తన ఇంటిలో గుర్తుతెలియని వ్యక్తులు ప్రవేశించి మెయిన్ డోర్ తెరిచి, ఇనుప బీరువా తాళాలు పగులగొట్టి సుమారు రూ. 9,00,000/– విలువైన 72 గ్రాముల బంగారు ఆభరణాలు మరియు కొన్ని వెండి ఆభరణాలు దొంగిలించారని ఫిర్యాదు చేశారు.దీనిపై చేబ్రోలు పోలీస్ స్టేషన్ ఎస్సై వీరనారాయణ కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. కేసు దర్యాప్తులో భాగంగా అందిన విశ్వసనీయ సమాచారం మేరకు తెనాలి డీఎస్పీ శ్రీ జనార్ధన్ రావు గారి పర్యవేక్షణలో, పొన్నూరు రూరల్ సర్కిల్ సీఐ శ్రీ కృష్ణయ్య గారు, చేబ్రోలు ఎస్సై శ్రీ వీరనారాయణ గారు మరియు సిబ్బంది కలిసి కొత్తరెడ్డిపాలెం సెంటర్ వద్ద వాహనాల తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఒక అనుమానిత వ్యక్తి పోలీసులను గమనించి పారిపోవడానికి ప్రయత్నించగా, వెంటనే అదుపులోకి తీసుకుని విచారించారు. విచారణలో సదరు వ్యక్తి ఫిర్యాదిదారురాలి భర్త సాతర్ల గోపి (36 ) గుండవరం గ్రామ నివాసి అని తేలింది.

# ఖమ్మం జిల్లాలో మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి పర్యటన.

పాలేరు మే 10(ప్రజా కలం న్యూస్ )

తెలంగాణ రెవెన్యూ, గృహ నిర్మాణం, సమాచార శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి ఆదివారం జిల్లాలో విస్తృతంగా పర్యటించారు. మధిర నుంచి కూసుమంచి వరకు జరిగిన పలు శుభకార్యక్రమాల్లో పాల్గొని జనంతో మమేకమయ్యారు. తొలుత మధిర పట్టణం జిలుగుమాడులో బోయిన శ్రీనివాసరావు - చిలక పున్నయ్యల పిల్లల వివాహ వేడుకకు హాజరైన మంత్రి,



అనంతరం ఖమ్మం నగరంలోని శ్రీనివాసనగర్‌లో వేప అంజయ్య, సామల సత్యం కుమారుల వివాహాలకు, మామిళ్లగూడెంలో తూము అనిల్ కుమార్తె వివాహ వేడుకకు హాజరయ్యారు. దానవాయిగూడెంలో కొలిచలం గురునాథం కుమారుడి శుభకార్యానికి హాజరై వధూవరులను ఆశీర్వదించారు. కైకొండాయిగూడెంలోని శ్రీ కాశీ విశ్వేశ్వరస్వామి ఆలయ పునఃప్రతిష్ఠ మహోత్సవంలో పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. ఖమ్మం ఎస్ ఆర్ హోమ్స్ లో దేవరపల్లి శ్రీనివాస రెడ్డి, ఏదులాపురం మున్సిపాలిటీ పరిధిలోని సాయి ప్రభాత్ నగర్ లో నాగేంద్రప్రసాద్ నివాసాల్లో జరిగిన ఉప్పలమ్మ, మైసమ్మ తల్లి వేడుకల్లో పాల్గొన్నారు. ఖమ్మం రూరల్ మండలం తీర్థాలలో బానోత్ తేజా కుమార్తె వివాహానికి, ఏదులాపురం మున్సిపాలిటీ పరిధిలోని రెడ్డిపల్లిలో పిట్టల గణపయ్య కుమారుడి పెళ్లికి, కేబీఆర్ నగర్‌లో షేక్ మోసిన్ ఖాన్ కుమారుడి రిసెప్షన్ వేడుకకు హాజరై పట్టు వస్త్రాలను కానుకగా సమర్పించారు. చివరగా కూసుమంచి మండలం పెరికసింగారంలో సంద్ర ఉపేందర్ కుమారుడి వివాహ వేడుకలో పాల్గొని నూతన వధూవరులను ఆశీర్వదించారు. ఆయా ప్రాంతాల్లో మంత్రి పొంగులేటికి ప్రజలు, నాయకులు ఘనస్వాగతం పలికారు.

# నూతన వధూవరులను పాలేరు మాజీ శాసనసభ్యులు కందాళ ఉపేందర్ రెడ్డి ఆశీర్వాదం.

పాలేరు మే 10( ప్రజా కలం న్యూస్ )

కూసుమంచి మండలం పరిధిలోని ఆదివారం పెరికసింగారం గ్రామానికి చెందిన శ్రీ జూకూరి చందర్ రావు, సుజాతల కుమారుడు సాయి పవన్‌కు హారికల వివాహం ఘనంగా జరిగింది. ఈ వివాహ వేడుక పాలేరు



బీవీ రెడ్డి ఫంక్షన్ హాల్‌లో జరిగిన సందర్భంగా, స్థానిక ప్రజలు, రాజకీయ నాయకులు భారీ సంఖ్యలో పాల్గొన్నారు. పాలేరు మాజీ శాసనసభ్యులు శ్రీ కందాళ ఉపేందర్ రెడ్డి ఈ వివాహ వేడుకలో హాజరై, నూతన వధూవరులైన సాయి పవన్, హారికలను ఆశీర్వదించారు.

ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షులు, ప్రధాన కార్యదర్శి, డిసిసిబి మాజీ డైరెక్టర్, సర్పంచులు, మాజీ సర్పంచులు, మాజీఎంపీటీసీలు, మండల పార్టీ, నాయకులు కార్యకర్తలు, వారి కుటుంబ సభ్యులు, అభిమానులు, తదితరులు పాల్గొన్నారు.

# మద్యానికి బానిసై వ్యక్తి ఆత్మహత్య

తానూర్, మే 10(((ప్రజా కలం): మండలంలోని జౌల (కె) గ్రామానికి చెందిన సావంత్ దేవానంద్ (35) అనే యువకుడు మద్యానికి బానిసై ఆత్మహత్య చేసుకున్నాడు, ఎస్సై షేక్ జుబేర్ తెలిపిన వివరాల ప్రకారం.. దేవానంద్ గతకొద్ది రోజులుగా మద్యానికి బానిసై పని చేయకుండా జులాయిగా తిరిగేవాడు,కుటుంబ సభ్యులు మందలించడంతో మనస్తాపానికి గురైన ఆయన, ఆదివారం ఉదయం తన వ్యవసాయ చేనులో చెట్టుకు ఉరి వేసుకొని ప్రాణాలు తీసుకున్నాడు,మృతుని భార్య మీరా ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



# "తాలు" పేరుతో ఎలాంటి కోతలు విధించొద్దు

**-అదనపు కలెక్టర్ శ్రీనివాస్ రెడ్డి**

**రైస్ మిల్లర్లు ధాన్యం స్వీకరణలో సహకరించాలి**

**కొనుగోళ్ల వేగం పెంచేందుకు హమాలీల సంఖ్యను పెంచాలి**

**నాణ్యతపై సందేహాలుంటే ముందుగా డీఎస్‌వోకు సమాచారం ఇవ్వాలి**

**ధాన్యం కొనుగోళ్లపై సమీక్షించిన అదనపు కలెక్టర్.**




ఖమ్మం, మే 10( ప్రజా కలం న్యూస్)

ఖమ్మం ఆదివారం రైస్ మిల్లుల వద్ద ధాన్యం దిగుబడి చేసుకునే సమయంలో "తాలు" పేరుతో ఎలాంటి కోతలు విధించొద్దని అదనపు కలెక్టర్ పి.శ్రీనివాస్ రెడ్డి తెలిపారు. ఆదివారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో ధాన్యం కొనుగోళ్లపై జిల్లా పౌర సరఫరాల శాఖ అధికారులు, రైస్ మిల్లర్లు, మిల్లర్స్ అసోసియేషన్ ప్రతినిధులతో కలిసి అదనపు కలెక్టర్ పి. శ్రీనివాస్ రెడ్డి సమీక్షించారు.

అదనపు కలెక్టర్ పి. శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ, "తాలు" పేరుతో రైస్ మిల్లర్లు ఎలాంటి కోతలు విధించరాదని స్పష్టం చేశారు. రైతులు తీసుకొచ్చిన ధాన్యాన్ని నిర్దిష్ట కారణాలు లేకుండా తిరస్కరించ వద్దని సూచించారు. ఏదైనా ధాన్యం ఎఫ్.ఏ.క్యూ. నాణ్యత ప్రమాణాలకు అనుగుణంగా లేదని భావించిన పక్షంలో, వెంటనే జిల్లా పౌర సరఫరాల అధికారికి (డీఎస్‌వో) సమాచారం ఇవ్వాలని ఆదేశించారు. సమాచారం అందిన వెంటనే వ్యవసాయ శాఖ అధికారులతో కూడిన సాంకేతిక సహాయ కమిటీని రైస్ మిల్లులకు పంపించి ధాన్యం నాణ్యతను పరిశీలిస్తామని తెలిపారు.

సాంకేతిక కమిటీ నివేదికలో నాణ్యత ప్రమాణాలు లేవని నిర్ధారణ అయిన పక్షంలో మాత్రమే ధాన్యాన్ని తిరస్కరిస్తామని స్పష్టం చేశారు. రైస్ మిల్లర్లు అందరూ ధాన్యం స్వీకరణలో సహకరించాలని సూచించారు.

ధాన్యం కొనుగోళ్ల ప్రక్రియ వేగవంతం కావాలంటే హమాలీల సంఖ్యను పెంచాలని ఆదేశించారు. రైతులు ధాన్యం విక్రయంలో ఇబ్బందులు పడకుండా ప్రతి రైస్ మిల్లర్ బాధ్యతాయుతంగా వ్యవహరించాలని తెలిపారు. ఈ సమావేశంలో జిల్లా పౌర సరఫరాల శాఖ అధికారి చందన్ కుమార్, మిల్లర్ల అసోసియేషన్ అధ్యక్షులు బొమ్మ రాజేశ్వర్ రావు, మిల్లర్లు, సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# పూర్వ విద్యార్థుల అపూర్వ కలయిక ఆత్మీయ సమ్మేళనం

**బుగ్గారం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు 2000--01 బ్యాచ్**

బుగ్గారం మండల కేంద్రం లోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు 2000-01 బ్యాచ్ పూర్వ విద్యార్థుల అపూర్వ కలయిక ఆత్మీయ సమ్మేళనం ఆదివారం రోజున ధర్మపురి నాని ఫంక్షన్ హాల్ లో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులు గురువు లైనటువంటి శంకర్, రాధాకిషన్, పూర్ణచంధర్, విజయ్ కుమార్, సతీష్ కుమార్, చంద్రమౌళి, వెంకట్ రమణ, విజయ్ కుమార్, గణేష్ తదితర గురువులను ఘనంగా ఆహ్వానించుకొని వారికి పూల మాలలు శాలువాల తో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులు, పూర్వ విద్యార్థులు తమ అను భవాలను నెమర వేసుకొని ఉజ్వల భవిష్యత్తుకు బాటలు చేసుకొని ఒక్కరు గొప్ప స్థాయి లో ఉండాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమం లో పూర్వ విద్యార్థు లు విద్యార్థినిలు, తదితరులు పాల్గొన్నారు.




# పకడ్బందీగా బాసర మాస్టర్ ప్లాన్ అమలు

**దేవాదాయ శాఖ కమిషనర్ హనుమంతరావు.**



నిర్మల్, మే 10(ప్రజా కలం జిల్లా ప్రతినిధి): బాసర శ్రీ జ్ఞాన సరస్వతి ఆలయ మాస్టర్ ప్లాన్ అమలుపై అధికారులు క్షేత్రస్థాయి పరిశీలన చేశారు.ఆదివారం రాష్ట్ర దేవాదాయ శాఖ కమిషనర్ హనుమంతరావు, జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా లు బాసర శ్రీ జ్ఞాన సరస్వతి అమ్మవారి ఆలయ మాస్టర్ ప్లాన్ అమలు గురించి పర్యటించారు.

ముందుగా అధికారులు సరస్వతి అమ్మవారిని దర్శించుకున్నారు.

ఆ తర్వాత ఆలయ ప్రాంగణం, మహాలక్ష్మి అమ్మవారి ఆలయం, వ్యాస గుహ తదితర ప్రాంతాలు తిరిగి చూశారు. మాస్టర్ ప్లాన్ అమలు గురించి కీలక అంశాలు చర్చించారు.

ఈ సందర్భంగా దేవాదాయ శాఖ కమిషనర్ హనుమంతరావు మాట్లాడుతూ, బాసర మాస్టర్ ప్లాన్ అమలుతో ఆలయ రూపురేఖలు మారనున్నాయని చెప్పారు. బాసర క్షేత్రం ఆధ్యాత్మిక, పర్యాటక కేంద్రాలుగా అభివృద్ధి చెందుతుంది అని అన్నారు. 225 కోట్ల రూపాయల వ్యయంతో బాసర ఆలయాన్ని ప్రఖ్యాత ఆధ్యాత్మిక కేంద్రంగా తీర్చిదిద్దనున్నట్లు చెప్పారు. ఆగమ శాస్త్రల నియమాల ప్రకారం, భక్తుల విశ్వాసాలకు అనుగుణంగా, అభివృద్ధి పనులు చేపడతామని తెలిపారు. అమ్మవారి దర్శనం కోసం దేశ నలుమూలల నుంచి వచ్చే భక్తులకు అన్ని వసతులు కల్పిస్తామని పేర్కొన్నారు. జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా మాట్లాడుతూ, బాసర ఆలయ అభివృద్ధి కొరకు ఇటీవలి రాష్ట్ర ముఖ్యమంత్రి శంకుస్థాపనలు చేశారని చెప్పారు. మాస్టర్ ప్లాన్ అమలు ద్వారా



ఆలయం అభివృద్ధి చెందుతుందని పేర్కొన్నారు. భక్తులకు సకల సౌకర్యాలతో ఆలయ నిర్మాణం జరుగుతుందని అన్నారు. ఆలయ అభివృద్ధి పనులు ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తామని చెప్పారు. రానున్న గోదావరి పుష్కరాలకు తగిన ఏర్పాట్లు చేస్తామని వివరించారు. ఈ కార్యక్రమంలో భైంసా సబ్ కలెక్టర్ అజ్మీరా సంకేత్ కుమార్, ఎఎస్పీ సాయికిరణ్, ఆలయ ఈవో అంజనా దేవి తహసిల్దార్ పవన్ చంద్ర, ఇతర అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.



# ఆయిల్ ఫామ్ తోటలను సందర్శించిన జిల్లా ఉద్యాన శాఖ అధికారిని లత



ధర్మపురి, మే 10 : ( ప్రజా కలం ప్రతినిధి )

జగిత్యాల జిల్లా ధర్మపురి మండలం లోని దోనూర్ గ్రామం లో వివిధ ఆయిల్ పామ్ తోటలను జిల్లా ఉద్యాన వన శాఖ అధికారిని లత ఆదివారం రోజున సందర్శించడశీ జరిగింది. ఈ సందర్భంగా దోనూర్ గ్రామం లో 4 ఎకరాల్లో ఆయిల్ పామ్ సాగు చేస్తున్న రుద్రపల్లి లచ్చన్న, అల్లూరి గంగారాం గార్ల తోటలను బోరె రాజయ్య డ్రాగన్ ఫ్రూట్ తోటని సందర్శించడం జరిగింది

ఇలాగే నూతన పంటలకి రైతులు సాగుకి ముందుకి రావాలని ప్రభుత్వం సబ్సిడీలు పొందాలని చెప్పటం జరిగింది. వివిధ దశల లో ఉన్న ఆయిల్ పామ్ గెలలను పరిశీలించి వాటికి తగు ఎరువుల యాజమాన్యం పద్దతులను వివరించడం జరిగింది. ఒక్కో ఆయిల్ పామ్ చెట్టుకు దాదాపు10 నుండి 12 గెలలు వేయడం గమనించారు మొత్తం తోటలోని గెలలు కొన్ని మొదటి కోతకి సిద్ధంగా ఉన్నాయని పక్వానికి వచ్చి కోతకు అను కూలంగా ఉన్నాయని లత తెలిపారు. జిల్లా ఉద్యాన వన శాఖ అధికారిని మాట్లాడుతూ ఇప్పటి వరకు జగిత్యాల జిల్లా లోని ఆయిల్ పామ్ రైతులందరు ఉద్యాన శాఖ సలహాలు సూచన లు పాటించడం జరిగిందని కావున కోతకు వచ్చే ఆయిల్ ఫామ్ తోటల రైతులు సమయం ను పాటించి సూచించిన యాజ మాన్య పద్దతులను పాటించాల ని కోరడం జరిగింది, అదే విధంగా గెలల కోతకు సంబంధించి రైతు లు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, గెలలు కోసే విధానం గురించి ఉద్యాన శాఖ ద్వారా శిక్షణ ఇవ్వడం జరుగుతుంది అని తెలిపారు, ఈ కార్యక్రమం లో ధర్మపురి హెచ్ ఈ ఓ వంశీకృష్ణ, లోహియా కంపెనీ, ప్రతినిధి రమణ, అయిల్ పామ్ అభ్యు దయ రైతులు పాల్గొన్నారు.



# హైదరాబాదు లో జరిగే మోదీ సభకు తరలి వెళ్లిన బీజేపి నాయకులు

**-ధర్మారం మండల బీజేపి పార్టీ ఆధ్వర్యంలో**

ధర్మారం, మే 10 : ( ప్రజా కలం ప్రతినిధి )

ధర్మారం మండల కేంద్రం లోని భారతీయ జనతా పార్టీ నాయకులు చలో హైదరాబాద్ నరేంద్ర మోడీ పెరేడ్ గ్రౌండ్స్ లో జరిగే సభకు తరలి వెళ్లడం జరిగింది. మొన్న జరిగిన ఐదు రాష్ట్రాల ఎన్నికల్లో మూడు రాష్ట్రాలు గెలుచుకున్న విషయం తెలిసిందే రాబోయే రాష్ట్ర ఎన్నిక ల్లో బీజేపి దే గెలుపని బీజేపి నాయకులు సంతోషం తో మోడీ మీటింగ్ జరిగే సభకు తరలి వెళ్లారు ఈ కార్యక్రమం లో ధర్మారం భారతీయ జనతా పార్టీ అధ్యక్ష కార్యదర్శులు, తీగుళ్ల సతీష్ రెడ్డి, దేవి రాజలింగు, దేవి కొమరేష్, హరే లక్ష్మణ్, సామంతుల కిరణ్, బాలకృష్ణ, తదితరులు వెళ్లినట్లు దేవి రాజలింగు తెలిపారు.

## కందుకూరులో జనగణన స్వీయ గణన గురించి అవగాహన

### కందుకూరు ఆర్డీవో కార్యాలయం నుంచి చౌరస్తా వరకు ర్యాలీ నిర్వహించిన కందుకూరు ఆర్డీవో జగదీశ్వర్ రెడ్డి

మహేశ్వరం, మే 10,(ప్రజా కలం)

కందుకూరులో జనగణన స్వీయ గణన గురించి అవగాహన కోసం కందుకూరు ఆర్డీవో కార్యాలయం నుంచి చౌరస్తా వరకు ర్యాలీ నిర్వహించడం జరిగింది. ర్యాలీలో ఆర్డీవో జగదీశ్వర్ రెడ్డి మాట్లాడుతూ మే నెల 10 తేదీ వరకు జనగణన సొంతంగా మన మొబైల్ లోనే




చేసుకోవచ్చని దీనివల్ల మనకు సమయం ఆదా అవుతుందని అట్లాగే మన వివరాలు జనగణనలో నమోదవుతాయని కాబట్టి ప్రతి ఒక్క వ్యక్తి జనగణన సొంతంగా చేసుకోవాలని కోరారు. జనగణనలో మొదటి దశ లో భాగంగా ఇండ్లకు సంబంధించిన గణన జరుగుతోందని అందులో వివరాలు చాలా తేలికగా అర్థం చేసుకునే విధంగా ఉంటాయని వాటిని మనవే సొంతంగా వెబ్సైట్ నమోదు చేసుకోవచ్చని తెలిపారు.జనగణలో మన వివరాలు అందిస్తే ప్రభుత్వం నుంచి వచ్చే అన్ని పథకాలు అట్లాగే ప్రాంత అభివృద్ధి రాష్ట్ర అభివృద్ధి దేశ అభివృద్ధిలో ఈ యొక్క వివరాలు తోడ్పడతాయని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా సెన్సస్ అధికారి శిరీష తాసిల్దార్ గోపాల్ ఎంపీడీవో సరిత , కలెక్టరేట్ అధికారి వినోద్ కందుకూరు సర్పంచ్ పాండు అనేక గ్రామాల సర్పంచులు వివిధ కార్యాలయాల సిబ్బంది గ్రామ ప్రజలు పాల్గొన్నారు.



## పటాన్‌చెరులో ప్రభుత్వ నాయబ్ ఖ్వాజీ కార్యాలయం ప్రారంభం

-పటాన్‌చెరు రామచంద్రపురం అమీన్‌పూర్ జిన్నారం మండలాలకు ప్రభుత్వ నాయబ్ ఖ్వాజీగా హాఫిజ్ మొహమ్మద్ ఇబ్రహీం నియామకం

-ఖ్వాజీ ఆఫీసులు మైనారిటీ సంక్షేమ శాఖ పరిధిలో ప్రాంతీయ వక్ఫ్ బోర్డుల ఆమోదంతో పనిచేస్తాయి

-ముస్లిం వివాహాల రిజిస్ట్రేషన్ చట్టపరంగా నాయబ్ ఖ్వాజీ హాఫిజ్ మొహమ్మద్ ఇబ్రహీం ద్వారా చేయించుకోవాలి

అధ్యక్ష ఖ్వాజీ హాజీ సయ్యద్ లతీఫ్ అలీ ఖాద్రి అధికార ప్రకటన

పటాన్ చేరు మే 10 (ప్రజా కలం) ప్రతిని

పటాన్‌చెరు డివిజన్ పరిధిలోని శాంతినగర్ కాలనీలో తెలంగాణ ప్రభుత్వ నాయబ్ ఖ్వాజీ కార్యాలయం అధ్యక్ష ఖ్వాజీ హాజీ సయ్యద్ లతీఫ్ అలీ ఖాద్రి ముఖ్య అతిథిగా పాల్గొని ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పటాన్‌చెరు నియోజకవర్గానికి సంబంధించిన నాలుగు మండలాల ముస్లిం వివాహాల రిజిస్ట్రేషన్ నాయబ్ ఖ్వాజీ హాఫిజ్ మొహమ్మద్ ఇబ్రహీం ను సంప్రదించి రిజిస్ట్రేషన్ ప్రక్రియ చేసుకోవాలని తెలిపారు. ముస్లిం వివాహం నిఖా జరిగిన తర్వాత, ఆ వివాహాన్ని రిజిస్టర్ చేయడం చట్టపరంగా ముఖ్యమని తెలిపారు.దీనికోసం ఖాజీ కార్యాలయంలో నిఖా నామా నమోదు చేస్తారని తెలిపారు. వధూవరులు ఆధార్ కార్డు, పాన్ కార్డు, పాస్ పోర్టు సైజ్ ఫోటోలు,ఆహ్వాన పత్రికను సమర్పించి తమ వివాహాన్ని రిజిస్టర్ చేయించుకోవాలని తెలిపారు.ఖ్వాజీ జారీ చేసిన నిఖా నామా భారత చట్టం ప్రకారం చెల్లుబాటు అయ్యే సాక్ష్యంగా పరిగణించబడుతుందని తెలిపారు. ఖ్వాజీ కార్యాలయాలు మైనారిటీ సంక్షేమ శాఖ పరిధిలో, ప్రాంతీయ వక్ఫ్ బోర్డు ఆమోదంతో పనిచేస్తాయని, వివాహాలు ధార్మిక కార్యకలాపాల కోసం ఇది ఏర్పాటు చేయబడతాయని, ఖ్వాజీ కార్యాలయ అధికారిక గుర్తింపు కోసం తెలంగాణ రాష్ట్ర వక్ఫ్ బోర్డు వెబ్ సైట్ ను సంప్రదించడం మంచిదని తెలిపారు. ఈ కార్యక్రమంలో వారితోపాటు సయ్యద్ జహీర్, ఇమామ్ సహాబ్ జామ మస్జిద్ బిహెచ్ఇఎల్ మొహమ్మద్ అబ్దుల్ సత్తార్, డాక్టర్ ఫహీం, ఇస్మాయిల్, జావిద్ హుస్సేన్, ముజీబుర్ రహ్మాన్, సలీం ఖాన్, ముస్తఫా, అన్సార్, సమీర్, యూసుఫ్, వాజిద్, తదితరులు పాల్గొన్నారు.

## జనగణన ఫీల్డ్ విధులు ప్రారంభించి ఇంటింటికి వెళ్లి వివరాలు సేకరించాలి

### బడంగ్‌పేట్ సర్కిల్‌లో జనగణన ఏర్పాట్లు పూర్తి డిప్యూటీ కమిషనర్ వి. సమ్మయ్య

మహేశ్వరం, మే 10,(ప్రజా కలం)

జనగణన ఫీల్డ్ విధులు ప్రారంభించి ఇంటింటికి వెళ్లి వివరాలు సేకరించాలని రంగారెడ్డి జిల్లా మహేశ్వరం నియోజకవర్గం బడంగ్‌పేట్




మున్సిపల్ కార్యాలయంలో జనగణన కార్యక్రమానికి సంబంధించి సూపర్వైజర్లు ఎన్యుమరేటర్లతో సమీక్ష సమావేశం నిర్వహించబడింది. ఈ సందర్భంగా అన్ని సూపర్వైజర్లు విధిగా హాజరయ్యారు. అలాగే జనగణన నిర్వహణకు సంబంధించిన ఎన్యుమరేటర్ల తుది జాబితా సిద్ధం చేయడం జరిగింది.10-05-2026 తేదీన ఉదయం 11:00 గంటలకు బడంగ్‌పేట్ మున్సిపల్ కార్యాలయానికి హాజరైన సూపర్వైజర్లు మరియు ఎన్యుమరేటర్లకు ఆర్డర్ కాపీలు, హెచ్ ఎల్ బి మ్యాప్స్ ఐడీ కార్డులు పంపిణీ చేశారు..ఈ సందర్భంగా డిప్యూటీ కమిషనర్ వి. సమ్మయ్య మాట్లాడుతూ, రేపటి నుండి జనగణన ఫీల్డ్ విధులు ప్రారంభించి ఇంటింటికి వెళ్లి వివరాలు సేకరించాలని అధికారులను ఆదేశించారు. జనగణన ప్రక్రియను సమర్థవంతంగా, ఖచ్చితత్వంతో నిర్వహించాలని సూచించారు.ఈ కార్యక్రమంలో సెంసుస్ స్టాటిస్టికల్ ఆఫీసర్స్ ఎం.డి. సాహిల్, విజయ్, శివాతో పాటు సంబంధిత ఏ ఎం సి ఆఫీస్ స్టాఫ్ పాల్గొన్నారు.

# ఎన్ హెచ్ ఎం ఉద్యోగులకు వేతనాలు ఇవ్వకుంటే ఉద్యమం తప్పదు

-వేతనాలు అందక పస్తులు ఉంటున్న ఉద్యోగుల కుటుంబాలు

- ఉద్యోగులపై కనికరం చూపుని ప్రభుత్వం

-మెడికల్ యూనియన్ రాష్ట్ర కార్యదర్శి యాదగిరి డిమాండ్.

సంగారెడ్డి ప్రతినిధి మే 10( ప్రజా కలం):

ఎన్ హెచ్ ఎం ఉద్యోగులకు వేతనాలు ఇవ్వకుంటే ఉద్యమం తప్పదు వేతనాలు అందక పస్తులు ఉంటున్న ఉద్యోగుల కుటుంబాలు ఉద్యోగులపై కనికరం చూపుని ప్రభుత్వం పెండింగ్లో ఉన్న ఎన్ హెచ్ ఎమ్ ఉద్యోగులకు 3, నెలల వేతనాలు ఇవ్వాలి మెడికల్ యూనియన్ రాష్ట్ర కార్యదర్శి యాదగిరి రాష్ట్ర ప్రభుత్వానికి ఆయన డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా మెడికల్ యూనియన్ రాష్ట్ర కార్యదర్శి ఎం యాదగిరి మాట్లాడుతూలి ఎన్ హెచ్ ఎం పరిధిలో పని చేస్తున్న అర్బన్ హెల్త్, ఏఎన్ఎం, స్టాఫ్ నర్స్, ల్యాబ్ టెక్నీ, ఉద్యోగులకు రాష్ట్ర ప్రభుత్వం గత 2 నెలల నుండి పెండింగ్లో ఉన్న వేతనాలు ఇవ్వకుండా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుందని ఆయన అన్నారు. ఉద్యోగులందరికీ 2 నెలల వేతనం పి.ఆర్.సి. ఏరియర్స్ వెంటనే విడుదల చేయాలని, ఆయన ప్రభుత్వానికి డిమాండ్ చేశారు 2018లో 510 జీ.వో.లో నష్టపోయిన 4000 కుటుంబాలకు న్యాయం చేయాలని ప్రభుత్వాన్ని నష్టపోయిన ఉద్యోగుల వారి ఎన్ హెచ్ ఎం. ఉద్యోగులు అర్బన్ హెల్త్ సెంటర్ లోపనిచేస్తున్న పబ్లిక్ హెల్త్ మేనేజర్, అకౌంటెంట్, ఎం.ఎన్.ఓ, వాచ్ మెన్, స్వీపర్, బ్లాక్ లెవెల్ అకౌంటెంట్స్, బస్తీ దావఖన సపోర్టింగ్ స్టాఫ్, ఎస్.ఎన్. సి.యు. డాటా ఎంట్రీ ఆపరేటర్, డిస్ట్రిక్ ఎర్లీ ఎంట్రవెన్షన్ సెంటర్ లో డెంటల్ టెక్నీషియన్ సోషల్ వర్కర్, ఆర్.కే.ఎస్.కే. మరియు న్యూట్రిషన్ కౌన్సిలర్, ఎన్.సి.డి. కౌన్సిలర్, ఓ.టి. టెక్నీషియన్/ ఓ.టి అసిస్టెంట్, ఎస్.ఎన్.సి యు సపోర్టింగ్ స్టాఫ్, బ్లడ్ బ్యాంక్ లో డి.ఈ.ఓ, డ్రైవర్స్ టీ. - హబ్ డాటా ఎంట్రీ ఆపరేటర్, ల్యాబ్ అటెండర్, పి.హెచ్.సి. డాటా ఎంట్రీ ఆపరేటర్, ప్రాథమిక ఆరోగ్య కేంద్రం కాంటిజెంటీ వర్కర్స్, ఎన్.ఆర్.సి. సపోర్టింగ్ స్టాఫ్ , ఆయుష్ ఎస్.ఎన్.ఓ / ఎం.ఎన్.ఓ. , ఎం.సి. హెచ్. స్టాఫ్, ఫిజియోథెరపిస్ట్, ఎస్. టి. ఎల్.ఎ స్.టీ.బీ. ఆల్ క్యాడర్స్, లేప్రోసి ఆల్ డిపార్ట్మెంట్ సూపర్వైజర్స్, అండ్ వీరందరికీ తక్కువ వేతనం వస్తున్నాయి వీరందరూ కూడా 510 జీవోలో మిస్ అయినవాళ్లు ఉ ద్యోగులందరికీ రెగ్యులర్ ఉద్యోగుల యొక్క బేసిక్ వేతనం అమలు చేయాలి, మహిళా ఉద్యోగులకు 180 రోజులు వేతనంతో కూడిన సెలవులు మంజూరు చేయాలి, ప్రతినెల 1వ తేదీ లోపు వేతనాలు చెల్లించాలి ఆయన ప్రభుత్వానికి డిమాండ్ చేశారు.

ఎన్.హెచ్.ఎం కాంట్రాక్ట్ అండ్ ఔట్సోర్సింగ్ ఉద్యోగులందరికీ కూడా ప్రక్షాళన చేసి రెగ్యులరైజ్ చేయాలని నేషనల్ హెల్త్ మిషన్ కాంట్రాక్ట్ అండ్ ఔట్సోర్సింగ్ ఉద్యోగుల పర్మనెంట్ చేయాలని ఆయన ప్రభుత్వానికి డిమాండ్ చేశారు లేనిపక్షంలో పెద్ద ఎత్తున పోరాటం నిర్వహిస్తామని ఆయన ప్రభుత్వానికి హెచ్చరించారు





## మోదీ సభకు పర్వతగిరి నుండి భారీగా తరలిన కార్యకర్తలు.

( వరంగల్/ పర్వతగిరి) మే 10, ప్రజాకలం ప్రతినిధి.

హైదరాబాద్‌లో నిర్వహించిన ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ బహిరంగ సభకు భారతీయ జనతా పార్టీ పర్వతగిరి మండలం నాయకత్వం ఆధ్వర్యంలో భారీ ఎత్తున కార్యకర్తలు తరలివెళ్లారు. పార్టీ పట్ల ఉన్న నిబద్ధతను, నాయకత్వంపై ఉన్న విశ్వాసాన్ని చాటుతూ మండలం నలుమూలల నుండి కార్యకర్తలు ఉత్సాహంగా సభకు హాజరయ్యారు.

ఈ కార్యక్రమాన్ని భారతీయ జనతా పార్టీ పర్వతగిరి మండలం అధ్యక్షుడు హార్కవత్ వినోద్ సమన్వయం చేయగా, జిల్లా ఉపాధ్యక్షులు కుడికాల శ్రీధర్, జిల్లా నాయకులు జాటోత్ శ్రీనివాస్ నాయక్, యువమోర్చా అధ్యక్షులు గొల్లపల్లి సంతోష్ కుమార్, ప్రధాన కార్యదర్శి బత్తిని దేవేందర్ తదితర నాయకులు ప్రత్యేకంగా పర్యవేక్షించారు. కార్యకర్తల రాకపోకల ఏర్పాట్లు, సభకు తరలింపు కార్యక్రమాలు క్రమబద్ధంగా నిర్వహించి పార్టీ శక్తిని చాటిచెప్పారు.

## మాజీ ఎంపిటిసి చంద్రపాల్ రెడ్డి జన్మదిన వేడుకలు

### చంద్రపాల్ రెడ్డికి పుట్టినరోజు శుభాకాంక్షలు తెలిపిన ఎమ్మెల్యే శంకర్,మాజీ ఎమ్మెల్యే ప్రతాప్ రెడ్డి

నందిగామ మే 10 (ప్రజా కలం):ప్రతినిధి

చంద్రపాల్ రెడ్డికి భవిష్యత్తులో మంచి పదవులు వస్తాయని షాద్ నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అన్నారు.నందిగామ మాజీ ఎంపీటీసీ,మాజీ కాంగ్రెస్ పార్టీ యూత్ అధ్యక్షుడి పుట్టినరోజు సందర్భంగా ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్,మాజీ ఎమ్మెల్యే చౌలపల్లి ప్రతాప్ రెడ్డి శాలువాతో సన్మానించి పుట్టినరోజు శుభాకాంక్షలు తెలియజేశారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. నందిగామ మండలంలో పార్టీ బలోపేతంలో చంద్రపాల్ రెడ్డి పాత్ర ప్రశంసనీయమని కొనియాడారు.నిరంతరం ప్రజల మధ్య ఉంటూ సేవా కార్యక్రమాల్లో ఉత్సాహంగా పాల్గొనే యువ నాయకుడు చంద్రపాల్ రెడ్డికి యువతలో మంచి ఆదరణ ఉందన్నారు.భవిష్యత్తు లో ఆయన మరిన్ని ఉన్నత పదవులు అధిరోహించాలని ఆయురారోగ్యాలతో వర్ధిల్లాలని ఆకాక్షించారు.





### మక్కల కొనుగోలు కేంద్రాలను సందర్శించిన పాక్స్ చైర్మన్ మార్నేని రవీందర్ రావు

# కొనుగోల్లలో జాప్యం చేయరాదు

-మక్కలకి క్వింతాకి 2,400/-లకి ప్రభుత్వం కొనుగోలు చేస్తుంది.

-రైతులు అధైర్యాపడవద్దు.



(వరంగల్ /వర్ధన్నపేట) మే 10 ప్రజాకలం ప్రతినిది:

ఐనవోలు మండలం నందనం రైతు సేవా సహకార సంఘం పరిధిలోని పంతిని, రాంనగర్, ఒంటిమామిడిపల్లి ఐనవోలు గ్రామాల్లో ఏర్పాటు చేసిన మక్కల కొనుగోలు కేంద్రాలను మాజీ టీజీ క్యాబ్ డ డీసీసీబీ చైర్మన్, ప్రస్తుత పాక్స్ చైర్మన్ మార్నేని రవీందర్ రావు సందర్శించారు.ఈ సందర్భంగా కొనుగోలు కేంద్రాల పనితీరును పరిశీలించిన ఆయన, ప్రభుత్వం నిర్ణయించిన క్వింటాల్‌కు రూ.2,400 మద్దతు ధరతోనే మక్కలను కొనుగోలు చేస్తున్నట్లు తెలిపారు. కొనుగోళ్లలో ఆలస్యం జరుగుతోందని రైతుల నుంచి వస్తున్న ఫిర్యాదులను వెంటనే పై అధికారుల దృష్టికి తీసుకెళ్లి సమస్యలు పరిష్కరించేలా చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. అలాగే కేంద్రాల్లో మక్కల తేమ శాతం, టార్పాలిన్లు, తూకం యంత్రాలు ఇతర మౌలిక సదుపాయాల అందుబాటును అధికారులు నిరంతరం తనిఖీ చేయాలని సూచించారు. అకాల వర్షాల పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని రైతుల పంటను త్వరితగతిన కొనుగోలు చేసి కేంద్రాల నుంచి వెంటనే తరలించేలా ఏర్పాట్లు చేస్తున్నామని వెల్లడించారు.రైతులు మక్కలను బాగా ఆరబెట్టి, తేమ శాతం సాధారణంగా 14 శాతం లోపు ఉండేలా చూసుకుని కొనుగోలు కేంద్రాలకు తీసుకురావాలని సూచించారు. మధ్యవర్తులను నమ్మకుండా నేరుగా ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లోనే తమ పంటను విక్రయించాలని రైతులకు విజ్ఞప్తి చేశారు.

## మంత్రి వర్యులు పొంగులేటి శ్రీనివాసరెడ్డి, ని మర్యాదపూర్వకంగా కలిసిన కూసుమంచి కాంగ్రెస్ మండల పార్టీ అధ్యక్షుడు బజ్జూరి వెంకటరెడ్డి.

పాలేరు మే 10(ప్రజా కలం న్యూస్ )

కూసుమంచి మండలం కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు గా నూతనంగా ఎన్నికైన సందర్భంగా ఆదివారం ఖమ్మం క్యాంపు కార్యాలయంలో మంత్రివర్యులు పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి ని మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో సత్కరించడం జరిగింది. ఈ సందర్భంగా నాపై నమ్మకం ఉంచి నాకు అధ్యక్షుడు పదవి ఎంపిక చేసిన మంత్రి కి బజ్జూరి వెంకటరెడ్డి కృతజ్ఞతలు తెలియజేశారు.

ఈ కార్యక్రమంలో ఖమ్మం జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు నూతి సత్యనారాయణ గౌడ్ , సుడా చైర్మన్ దుర్గాప్రసాద్, సిడిసి చైర్మన్ ఎర్రబోలు సూర్యనారాయణ రెడ్డి, ఎక్స్ ఎంపీపీ బానోత్ శ్రీను నాయక్, సర్పంచులు బానోతు నాగేశ్వరరావు, నీలకంఠం, ఏఎంసీ డైరెక్టర్ కంచర్ల సుధీర్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ మండల నాయకులు బొల్లంపల్లి సుధాకర్ రెడ్డి, జర్పుల శ్రీను నాయక్ ,ఇందుర్తి వెంకటరెడ్డి, పుల్లారెడ్డి పాల్గొనడం జరిగింది.



# బికేఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో సూరారం రాజీవ్ గృహకల్పలో 36 వ ఉచిత వైద్య శిబిరం

ప్రజాకలం/కుత్బుల్లాపూర్ (ప్రతినిధి) కుత్బుల్లాపూర్ నియోజకవర్గం సాయిబాబానగర్ డివిజన్ రాజీవ్ గృహకల్పలో బికేఅర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో 36వ ఉచిత వైద్య శిబిరం నిర్వహించిన ఈకార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఫౌండేషన్ అధ్యక్షులు కాంగ్రెస్ పార్టీ ప్రోటోకాల్



ఉ కోఆర్డినేటర్ కమిటీ వైస్ చైర్మన్ బొంగునూరి కిషోర్ రెడ్డి వైద్య శిబిరాన్ని ప్రారంభించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ... పేద మధ్యతరగతి ప్రజలు ఉచిత వైద్య సేవలు ఉపయోగించుకోవాలని అన్నారు. వైద్యంతో పాటు పేద మధ్యతరగతి పిల్లలకు విద్యకు ఎలాంటి ఇబ్బందులున్న బికేఆర్ ఫౌండేషన్ అండగా ఉంటుందన్నారు. కాలనీ ప్రజలకు సమస్యలు ఏమైనా ఉంటే సమస్య పరిష్కారమయ్యే వరకు అధికారులతో మాట్లాడి కృషి చేస్తానని తెలిపారు. మాకు సహకరిస్తున్న సీఎంఆర్ హాస్పిటల్ వైద్య బృందానికి బిగ్ న్యూస్ యాజమాన్యానికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈకార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు"ూ= సాదుయాదవ్ నరసింహారెడ్డి, గజేంద్ర, ప్రజా గాయకుడు శంకర్, శ్రీశైలంయాదవ్, అరుణ్ రెడ్డి, జగన్ ముదిరాజ్, మరియు రాజీవ్ గృహకల్ప కాలనీ ప్రజలు పాల్గొన్నారు



# ఘనంగా "బండారి" ఆత్మీయ సమ్మేళనం

## కార్యక్రమాని ఆతిథిగా హాజరైన ఎమ్మెల్యే కేపీ. వివేకానంద్

ప్రజాకలం/కుత్బుల్లాపూర్ (ప్రతినిధి) సిఎంసీ కొంపల్లి సర్కిల్ పరిధి శ్రీ ఆదిత్య ఉత్సవ్ బ్యాంక్విట్ హాల్ నందు బండారి ఫ్యామిలీ ఆహ్వానం మేరకు నిర్వహించిన బండారి వెల్ఫేర్ అసోసియేషన్ అద్వర్యంలో నిర్వహించిన కార్యక్రమానికి బిఆర్ఎస్ ఎల్పి విప్, ఎమ్మెల్యే కేపీ. వివేకానంద్ అతిధిగా హాజరయ్యారు. ఈసందర్బంగా వారు మాట్లాడుతూ....కుటుంబ ఆత్మీయ సమ్మేళనాలు మనలో నూతన ఉ త్తెజాన్ని నింపడంతో పాటు మన మూలాలను తెలియజేస్తాయన్నారు. ఈకార్యక్రమంలో బండారి వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షులు దశరథ్, వైస్ ప్రెసిడెంట్ లక్ష్మణ్, జనరల్ సెక్రెటరీ ప్రకాష్, ట్రెజరర్ మల్లేష్, బిఆర్ఎస్ సీనియర్ నాయకులు వారాల వినోద్ కుమార్, రాజకుమార్ ముదిరాజ్, మైసాగౌడ్, వేణు ముదిరాజ్, కిషోర్ ముదిరాజ్, అనిల్, బండారి ఫ్యామిలీ సభ్యులు పాల్గొన్నారు.

# "మహాత్మా" బిరుదు నిమిత్తంగా తెలుగు ప్రముఖులకు సన్మానం

నిజామాబాద్,(ప్రజా కలం ప్రతినిధి) మే 10:

నాడు 11మే 1888 రోజున ముంబై మహానగరంలో జ్యోతిరావు పూలేకి "మహాత్మ" అనే గొప్ప బిరుదును ప్రసాదించే ఐతిహాసిక వేళల్లో తెలుగువారు హాజరై ఉండిరి. నేడు దాని జ్ఞాపకార్థంగా ముంబైలోని ప్రఖ్యాత ఓబీసీ ఎస్సీ తెలుగు ప్రముఖులను సన్మానించనున్నారు.

"రాష్ట్రపితా మహాత్మా జ్యోతిరావు పూలే జన్మ ద్విశతాబ్ది మహోత్సవ సమితి" ఆధ్వర్యంలో సన్మాన కార్యక్రమం సోమవారం సాయంత్రం 4గంటలకు ప్రభాదేవిలోగల రవీంద్ర నాట్య మందిర్లో నిర్వహించారు. అతిథులుగా మహారాష్ట్ర మాజీ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ కపిల్ పాటిల్, మరాఠీ పత్రిక ఎడిటర్ జ్ఞానేష్ మహారావు హాజరై, వారి చేతుల మీదుగా సత్కారం కలదు. సత్కారమూర్తుల్లో కవి నడిమెట్ల ఎల్లప్ప (పద్మశాలి, వర్లీ), రణవేణి లక్ష్మణ్ (గంగాపుత్ర, గోరేగావ్), జూకంటి రాంచందర్ (కుర్మ సమాజం, ఖార్), వంగల కృష్ణ (యాదవ, ముంబై), మందపెల్లి లక్ష్మణ్ (నాయి సమాజం, నవీముంబై), తడ్కపెల్లి నరేష్ (రజక్/ధోబి, మహాలక్ష్మి, రచయిత అంబల జనార్దన్ (పద్మశాలి, మలాడ్), గురునాథ్ కేదాస్ (మాదిగ సమాజం, దాదర్), వడ్డి సూర్యనారాయణ, (మాల సమాజం, అంధేరి), నేలపూడి శరత్ మాల, బాలబోయిన రాంప్రసాద్ ముదిరాజ్, (కోలి, ముంబై), సామల లక్ష్మణ్ (యాదవ్, కంజుర్మార్గ్) తదితరులు కలరు. ఇట్టి ఉత్సవానికి నగరంలోని తెలుగు ప్రజలు భారీ సంఖ్యలో పాల్గొనాలని నిర్వాహకులు రోహిత్ డాలే కోరారు.



# హైదరాబాద్‌లో బౌద్ధ ధర్మ ప్రచార కార్యక్రమం

## : 200 పుస్తకాలను బహుకరించిన కేకే రాజా

నిజామాబాద్,(ప్రజా కలం ప్రతినిధి) మే 10:

డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ ఆశయాలు, బౌద్ధ ధర్మ ప్రచార కార్యక్రమాల విస్తరణకు ప్రముఖ బౌద్ధిస్ట్, సామాజిక సేవకుడు కేకే రాజా ముందుకు రావడం అభినందనీయమని బౌద్ధ వర్గాలు పేర్కొంటున్నాయి. హైదరాబాద్లో శనివారం జరిగిన సమావేశంలో బౌద్ధ కార్యక్రమాలపై విస్తృతంగా చర్చించారు. ఈ సందర్భంగా కేకే రాజా ప్రత్యేకంగా రెండు గంటలకు పైగా సమయం కేటాయించి బౌద్ధ ధర్మ ప్రచారం, సమాజంలో అంబేద్కర్ ఆలోచనల ప్రాధాన్యత, యువతలో చైతన్యం పెంపు వంటి అంశాలపై చర్చించినట్లు తెలిపారు. సమాజ మార్పు కోసం బాబాసాహెబ్ చూపిన మార్గం నేటికీ ఎంతో ప్రాసంగికమని పేర్కొన్నారు. అలాగే బౌద్ధ ధర్మం, డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ జీవిత విశేషాలు, సామాజిక ఉద్యమాలకు సంబంధించిన సుమారు 200కు పైగా పుస్తకాలను బహుకరించారు. ఈ పుస్తకాలు బౌద్ధ అధ్యయనం, సామాజిక అవగాహన పెంపుకు ఉపయోగపడతాయని అభిప్రాయం వ్యక్తం చేశారు. బౌద్ధ ప్రచార కార్యక్రమాలకు ప్రోత్సాహంగా రూ.5000 వేల రూపాయలు ఆర్థిక సహాయం అందించడం విశేషంగా నిలిచింది. సమాజంలో సమానత్వం, మానవత్వం, శాంతి సందేశాలను విస్తరించడంలో బౌద్ధ ధర్మం కీలక పాత్ర పోషిస్తోందని సమావేశంలో అభిప్రాయపడ్డారు. కేకే రాజా అందించిన సహకారానికి కృతజ్ఞతలు తెలుపుతూ, బాబాసాహెబ్ ఆశయ సాధన కోసం మరింత కృషి కొనసాగిసామని పేర్కొన్నారు.





# విద్యార్థి దశ నుండే క్రీడలపై ఆసక్తి పెంపొందించాలి

*సమాజం నుండి మాదకద్రవ్యాలను తరిమికొట్టాలి..*
*ప్రతి విద్యార్థి క్రీడా స్ఫూర్తి పెంపొందించుకోవాలి..*
*క్రీడలు.. క్రీడాకారుల అభివృద్ధికి సంపూర్ణ సహకారం*
*పటాన్చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి..*
*పటాన్చెరులో ఘనంగా ప్రారంభమైన గూడెం విష్ణువర్ధన్ రెడ్డి స్మారక 10వ జాతీయస్థాయి ఓపెన్ కరాటే ఛాంపియన్షిప్ పోటీలు..*
*లాంఛనంగా ప్రారంభించిన ఎమ్మెల్యే జిఎంఆర్*
*వివిధ రాష్ట్రాల నుండి హాజరైన రెండు వేల మంది క్రీడాకారులు*
*ఎమ్మెల్యే జిఎంఆర్ ఆధ్వర్యంలో భారీ ఏర్పాట్లు..*
*కృతజ్ఞతలు తెలిపిన క్రీడాకారులు.. తల్లిదండ్రులు..*



పటాన్ చేరు మే 10 (ప్రజా కలం) ప్రతినిధి

పటాన్చెరు ప్రస్తుత పోటీ ప్రపంచంలో మానసిక ప్రశాంతత, శారీరక ధారుఢ్యత కోసం విద్యార్థి దశ నుండి క్రీడలపై ఆసక్తి పెంపొందించేలా తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు ప్రోత్సహించాలని.. నియోజకవర్గంలో క్రీడలు, క్రీడాకారుల అభివృద్ధికి సంపూర్ణ సహకారం అందిస్తున్నామని పటాన్చెరు శాసనసభ్యులు గూడెం మహిపాల్ రెడ్డి అన్నారు.ఆదివారం పటాన్చెరు డివిజన్ పరిధిలోని భారత రత్న పివి నరసింహారావు ఆడిటోరియంలో ఎమ్మెల్యే జిఎంఆర్ సౌజన్యంతో లక్కీ మార్షల్ ఆర్ట్స్ అకాడమీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన గూడెం విష్ణువర్ధన్ రెడ్డి స్మారక 10 జాతీయ స్థాయి కరాటే ఛాంపియన్ షిప్ పోటీలకు ఎమ్మెల్యే జిఎంఆర్ ముఖ్యఅతిథిగా హాజరై.. లాంచనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఎమ్మెల్యే జిఎంఆర్ మాట్లాడుతూ గత 10 సంవత్సరాలుగా జాతీయ స్థాయిలో కరాటే పోటీలు నిర్వహించడం సంతోషకరంగా ఉందన్నారు. వివిధ రాష్ట్రాల నుండి సుమారు 2000 మంది క్రీడాకారులు టోర్నమెంట్ కు హాజరు కావడం పటాన్చెరు నియోజకవర్గం యొక్క ఖ్యాతిని నలుదిశలా చాటి చెప్పినట్లు అయ్యిందని అన్నారు చిన్ననాటి నుండి తనకు క్రీడలు అంటే ఎంతో మక్కువ అని, నియోజకవర్గ స్థాయిలో క్రీడలు, క్రీడాకారుల అభివృద్ధికి సంపూర్ణ సహకారం అందిస్తున్నామని తెలిపారు. దశాబ్దాల చరిత్ర కలిగిన పటాన్చెరు పట్టణంలోని మైత్రి మైదానాన్ని ఆధునికరించడంతోపాటు.. ఏడాది పొడవునా వివిధ క్రీడ అంశాల్లో రాష్ట్ర, జాతీయ స్థాయి పోటీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. గ్రామీణ స్థాయి క్రీడాకారుల కోసం నియోజకవర్గ వ్యాప్తంగా మూడు మినీ స్టేడియాలు ఏర్పాటు చేస్తున్నామని అన్నారు. ప్రస్తుత సమాజంలో మాదకద్రవ్యాలు అత్యంత ప్రమాదకరంగా మారాయని. సమాజం నుండి వాటిని తరిమి కొట్టడంలో ప్రతి ఒక్కరూ కంకణబద్ధులు కావాలని విజ్ఞప్తి చేశారు. విద్యార్థి దశ నుండి పిల్లలకు వాటి దుష్పరిణామాలను వివరించాలని కోరారు విద్యార్థులు చదువుతోపాటు, క్రీడల పైన ఆసక్తి పెంచుకొని జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో రాణించాలని కోరారు. క్రీడాకారులకు ఎటువంటి సహకారం కావాలన్న తనను సంప్రదించాలని కోరారు కరాటే పోటీల నిర్వహణ కోసం ఎమ్మెల్యే జిఎంఆర్ 5 లక్షల రూపాయల సొంత నిధులను అందజేశారు ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్లు మెట్టు కుమార్ యాదవ్, అంజయ్య యాదవ్, మాజీ ఎంపీపీ యాదగిరి యాదవ్, అమీన్పూర్ మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ నరసింహ గౌడ్, దశరథ్ రెడ్డి, మాజీ ఎంపీటీసీ రామచంద్ర రెడ్డి, మైత్రి క్లబ్ అధ్యక్షుడు హనుమంత్ రెడ్డి, వెంకటేష్, చంద్రశేఖర్, షకీల్, టోర్నమెంట్ నిర్వాహకులు రాజు యాదవ్, వివిధ రాష్ట్రాల నుండి వచ్చిన క్రీడాకారులు, తల్లిదండ్రులు, అకాడమీ మాస్టర్లు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.




# కార్మికులను బానిసలుగా మార్చే 4లేబర్ కోడ్స్ జీవోను వెంటనే ఉపసంహరించుకోవాలి: జీవో కాపీల దహనం - కీలుకానీ లక్ష్మణ్

ప్రజాకలం/కుత్బుల్లాపూర్ (ప్రతినిధి) సిఐటియు కుత్బుల్లాపూర్ మండల కమిటీ ఆధ్వర్యంలో షాపూర్ నగర్ శుభం హోటల్ భవన నిర్మాణ కార్మికుల సంఘం అడ్డా దగ్గర నాలుగు లేబర్ కోడ్స్ అమలు జీవో కాపీలను దహనం చేశారు. ఈకార్యక్రమంలో సీఐటీయూ జిల్లా కమిటీ సభ్యులు పసుల అంజయ్య, కుత్బుల్లాపూర్ మండల కన్వీనర్ కీలుకాని లక్ష్మణ్ మాట్లాడుతూ కేంద్రంలోని బిజెపి నరేంద్ర మోడీ ప్రభుత్వం కార్మిక వర్గంపై యుద్ధాన్ని మొదలుపెట్టిందని ఈ లేబర్ కోడ్స్ కార్మికుల మెడలకు బిగించిన ఉరితాళ్లేనన్నారు. ఎన్నికల సమయంలో మాయ మాటలతో ప్రజలను వంచించిన పాలకులు, గద్దెనెక్కిన వెంటనే కార్పొరేట్ శక్తుల పాదాల కాడ కార్మిక హక్కులను తాకట్టు పెట్టిన కేంద్ర బిజెపి నరేంద్ర మోడీ ప్రభుత్వం రక్తం చిందించి సాధించుకున్న ఎనిమిది గంటల పనిదినం కనీస వేతనం, సామాజిక భద్రత వంటి హక్కులను ఈ ప్రభుత్వం తుంగలో తొక్కిందని కార్మిక వర్గంపై సాగుతున్న ఈ పాశవిక దాడిని సహించేది లేదన్నారు.థ చరిత్రలో ఏ రోజూ పాలకులు కార్మిక హక్కులను ఉచితంగా ఇవ్వలేదనీ లాటీలు తూటాలను ఎదిరించి పోరాటాల ద్వారానే మనం హక్కులను సాధించుకున్నాం పెద్ద పెద్ద పెట్టుబడిదారులు కార్పొరేట్ శక్తుల అండతో ఏర్పడిన ఈ ప్రభుత్వం కార్మికుల శ్రమను కారు చౌకగా కార్పోరేట్ శక్తులకు దోచిపెట్టడమే లక్ష్యంగా పెట్టుకుందని విమర్శించారు. ఇలాంటి ప్రభుత్వాన్ని సాగనంపే వరకు కార్మిక వర్గం ఐక్యతతో పోరాడాలన్నారు. ఈకార్యక్రమంలో సిఐటియు నాయకులు పాషా. శ్రీశైలం, యాదవరెడ్డి, సునీల్ తదితరులు పాల్గొన్నారు.



# ఓటు హక్కు ప్రజల వజ్రాయుధం

**-తమిళనాడు ఎన్నికల ఫలితాలు అందుకు నిదర్శనం**
**-బోడుప్పల్లో 377వ వారం డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కు జ్ఞానమాల**
**-డాక్టర్ అంబేద్కర్ ఆశయాలు కొనసాగిద్దాం**

**- అంబేద్కర్ ఆశయ సాధన సంఘం రాష్ట్ర అధ్యక్షుడు నత్తి మైసయ్య**

మేడిపల్లి మే 10(ప్రజాకలం న్యూస్)

మల్కాజ్గిరి మున్సిపల్ కార్పొరేషన్ బోడుప్పల్ సర్కిల్లో అంబేద్కర్ ఆశయ సాధన సంఘం రాష్ట్ర అధ్యక్షుడు నత్తి మైసయ్య ఆధ్వర్యంలో డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ విగ్రహానికి 377వ ఆదివారం జ్ఞానమాల సమర్పించి భారత రాజ్యాంగ నిర్మాణం కోసం ఆయన చేసిన సేవలను స్మరించుకున్నారు. అనంతరం నత్తి మైసయ్య మాట్లాడుతూ డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ రాజ్యాంగం ద్వారా కల్పించిన ఓటు హక్కు భారత ప్రజలకు వజ్రాయుధం లాంటిది. ప్రజల ఓటుతో గద్దెనెక్కిన పార్టీలు నిస్వార్థంగా ప్రజలకు సేవ చేసినంత కాలం ప్రజల అభిమానాన్ని ఆశీర్వాదాన్ని పొందుతారని, ఎప్పుడైతే ప్రజా సమస్యలను విస్మరించినప్పుడు ప్రజలు ఓటుతో తమకు గుణపాఠం చెప్తారని అందుకు తమిళనాడు, పశ్చిమబెంగాల్ ఎన్నికల ఫలితాలు అందుకు నిదర్శనం. ఇలాంటి అమూల్యమైన ఓటు హక్కును కల్పించిన డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ సేవలను నిత్యం స్మరించుకుంటూ, ఆయన ఆశయాలను ఆకాంక్షలను ప్రతి ఒక్కరూ నెరవేర్చాలని నత్తి మైసయ్య పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో రాపోలు శ్రీరాములు, గరుగుల యాకయ్య,సగ్గు నరసింహ, సాయి బండారి, చంటి నరేష్ తదితరులు పాల్గొన్నారు. ?



# బాధిత కుటుంబాన్ని పరామర్శించిన ఫ్యాక్స్ చైర్మెన్ యం. మనోజ్ గౌడ్.

( వరంగల్/ పర్వతగిరి) మే 10, ప్రజాకలం ప్రతినిధి.

పర్వతగిరి మండలం కల్లెడ గ్రామ వార్డ్ సభ్యులు చిరుత విజయ్ తండ్రి కీ,శే చిరుత యాకయ్య శనివారం సాయంత్రం స్వర్గస్తులయ్యారు. ఆదివారం వారి పార్థివ దేహనికి పూల మాల తో నివాళులర్పించిన ఫ్యాక్స్ చైర్మెన్ యం. మనోజ్ గౌడ్. ఈ కార్యక్రమంలో మాజీ వైస్ ఎంపీపీ బిఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షులు ఎర్రబెల్లి రాజేశ్వర్ రావు, ఫ్యాక్స్ డైరెక్టర్ గంగాధర్ రావు, మాజీ సర్పంచ్ బొట్ల కిష్టయ్య, మండల నాయకులు బొట్ల మధు, దొమ్మటి రాజు, సోషల్ మీడియా నాయకులు నరేష్, చిరుత రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

## బీసీ కులగణనకు

# కేంద్రం స్పష్టత ఇవ్వాలి

### - వి. హనుమంతరావు దీక్ష విరమణ




హైదరాబాద్, మే 10 (ప్రజా కలం ప్రతినిధి) జనగణనలో బీసీ వర్గాలను చేర్చి కులగణన నిర్వహించాలని డిమాండ్ చేస్తూ హైదరాబాద్ అంబర్‌పేటలో ప్రభుత్వ సలహాదారు వి. హనుమంతరావు చేపట్టిన నిరవధిక నిరాహార దీక్ష ఆదివారం విరమించింది. రెండు రోజులుగా కొనసాగిన దీక్షను తెలంగాణ శాసనసభ పక్షనేత మధుసూదనా చారి, ఎమ్మెల్సీ కోదండరాం, బీసీ నాయకులు జాజుల శ్రీనివాస్ గౌడ్ నిమ్మరసం ఇచ్చి విరమింపజేశారు.

ఈ సందర్భంగా హనుమంతరావు మాట్లాడుతూ.. దేశంలో బీసీలు 60 శాతానికి పైగా ఉన్నప్పటికీ వారికి తగిన న్యాయం జరగడం లేదన్నారు. జనాభా ప్రాతిపదికన బీసీలకు ప్రత్యేక రిజర్వేషన్లు కల్పించాలని డిమాండ్ చేశారు. బీసీ కులగణన విషయంలో కేంద్ర ప్రభుత్వం స్పష్టమైన వైఖరి ప్రకటించాలని కోరారు. బీసీల హక్కుల సాధన వరకు పోరాటం కొనసాగుతుందని, ర్యాలీలు, ధర్నాలు, ఉద్యమాలతో కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకువస్తామని తెలిపారు.

బీఆర్ఎస్, సీపీఎం, సీపీఐ సహా పలు రాజకీయ పార్టీలు, నిరుద్యోగ జేఏసీ దీక్షకు మద్దతు తెలిపాయని ఆయన పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీలు కోదండరాం, మధుసూదనాచారి, మాజీ ఐఏఎస్ అధికారులు చిరంజీవులు, పూర్ణచంద్రరావు, బీసీ నాయకులు జాజుల శ్రీనివాస్ గౌడ్, గుజ్జా కృష్ణ, మేకపోతుల నరేందర్, పీసీసీ వైస్ ప్రెసిడెంట్ జగదీశ్, అప్సర్ యూసుఫ్, జై సురేష్, టాపర్ సెల్ కార్పొరేషన్ వైస్ చైర్మన్ కేశం నాగరాజు గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

# బాధిత మైనర్ బాలికకు న్యాయం చేయాలి

### బండి సంజయ్ కుమారుడిని కఠినంగా శిక్షించాలి

### : పేట్ బషీరాబాద్ పీఎస్ ఎదుట బిఆర్ఎస్ మహిళా నాయకురాళ్ల ధర్నా....




ప్రజాకలం/కుత్బుల్లాపూర్ (ప్రతినిధి) కేంద్ర సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ కొడుకు బండి భగీరథ్ పై నమోదైన పోక్సో కేసు నేపథ్యంలో బాలికలపై జరుగుతున్న అఘాయిత్యాలపై కుత్బుల్లాపూర్ బిఆర్ఎస్ మహిళా నాయకురాల్లు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈసందర్భంగా బాధిత మైనర్ బాలికకు న్యాయం చేయాలని డిమాండ్ చేస్తూ, పేట్ బషీరాబాద్ పోలీస్ స్టేషన్ ఎదుట మహిళలు నిరసన కార్యక్రమం చేపట్టారు. అనంతరం బిఆర్ఎస్ మహిళా నాయకురాల్లు మాట్లాడుతూ.... బేటీ బచావో అంటూ మహిళల భద్రతపై పెద్ద ఎత్తున మాటలు చెప్పే బీజేపీ నాయకత్వం, ఇప్పుడు ఈ ఘటనపై స్పష్టమైన సమాధానం చెప్పాల్సిన బాధ్యత ఉందన్నారు. పోక్సో వంటి అత్యంత తీవ్రమైన కేసులో ఆరోపణలు ఎదుర్కొంటున్న వ్యక్తిపై ఎలాంటి రాజకీయ ఒత్తిళ్లు లేకుండా, నిష్పక్షపాత దర్యాప్తు జరిపి కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కేంద్ర సహాయ మంత్రిగా కొనసాగుతున్న బండి సంజయ్ కుమార్ వెంటనే తన పదవికి రాజీనామా చేసి, దర్యాప్తుకు సహకరించాలని మహిళా నాయకురాల్లు కోరారు. అధికార హోదాను ఉపయోగించి కేసును ప్రభావితం చేసే ప్రయత్నాలు జరగకూడదని హెచ్చరించారు. కుత్బుల్లాపూర్ ప్రాంతానికి చెందిన మైనర్ బాధితురాలికి ప్రభుత్వం పూర్తి రక్షణ కల్పించాలని, కుటుంబానికి న్యాయం జరిగేలా అన్ని విధాలుగా అండగా నిలవాలని వారు విజ్ఞప్తి చేశారు. మహిళల భద్రత, చిన్నారుల రక్షణ విషయంలో ఎలాంటి రాజీ ఉండకూడదని, నిందితులపై చట్టపరమైన కఠిన చర్యలు తీసుకోవాలని బిఆర్ఎస్ మహిళా నాయకురాల్లు స్పష్టం చేశారు. ఈధర్నా కార్యక్రమంలో బిఆర్ఎస్ మహిళా విభాగం నాయకురాల్లు పావని, స్రవంతి, సునీత, శైలజ, మంజుల, అరుణారెడ్డి, ఇంద్రారెడ్డి, పద్మ, ఫర్జానా, హేమలత, లావణ్య, పార్వతి, కరీమా, కవిత, మహిళా కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# నిజాంపేట్ మార్కెట్ యార్డ్ స్థలానికి ఎసరు

## - కబ్జాదారుల అక్రమ నిర్మాణాల కోసమా!

### - ప్రజా ప్రయోజనాల కోసం 2021సం లో 3ఎకరాల ప్రభుత్వ స్థలం కేటాయింపు

### - అధికారులే లేఅవుట్ ద్వారా స్వయంగా ఫెన్సింగ్ ఏర్పాటు

ప్రజాకలం/కుత్బుల్లాపూర్ (ప్రతినిధి)గత రెండు సంవత్సరాల కాలంగా రేకులు తొలగిస్తూ కంటైనర్ తో కబ్జాల పర్వం మొదలైంది. - ఈ కబ్జాలపై పలు పత్రికల్లో శీర్షికలతో గతం నుంచి అధికారుల దృష్టికి వెళ్లిన చర్యలపై పట్టించుకోని వైనం. కోట్ల రూపాయల విలువైన స్థలం కాజేసేందుకు, కబ్జాదారుడు అధికారుల, అలసత్యంను ఆసరా చేసుకుని ఇబ్బడి ముబ్బడిగా వ్యాపార సముదాయాలు, అక్రమ రూముల నిర్మాణాలు, ఇటీవల మరో అక్రమ రూము నిర్మించి తప్పుడు ధ్రువీకరణ పత్రాలతో వేరే సర్వే నెంబర్ 191 గోడపై వ్రాసి బెల్ట్ షాపు నిర్వహిస్తున్నారు. కుత్బుల్లాపూర్ నియోజకవర్గం నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ సర్వే నెంబర్ 87, 88 గతంలో వీధి వ్యాపారుల మార్కెట్ యార్డ్ కోసమని అప్పటి నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ ఐఏఎస్ కమిషనర్ గోపి హయంలో మూడు ఎకరాల ప్రభుత్వ భూమి లేఅవుట్ చేసి మార్కెట్ యార్డుకు కేటాయించారు. మొత్తం బ్లూ రేకులతో స్థలం చుట్టూ ప్రహరీ నిర్మాణం చేయడం జరిగింది. కేటాయించిన అట్టి స్థలం లో తమ వ్యాపారాలకు అంతగా రాణించదంటూ వ్యాపారులు నిరాకరించడంతో మున్సిపల్ కార్పొరేషన్ అధికారులు మార్కెట్ యార్డ్ స్థలం పెండింగ్ లో ఉంది. కోట్ల రూపాయల విలువ చేసే భూమి ఎలాగైనా కాజేసేందుకు కబ్జాదారులు కొంతకాలం స్తబ్దతగా ఉండి, మొదట కొన్ని ప్రహరీ రేకులను తొలగించి ఏకంగా కంటైనర్, మెకానిక్ షెడ్ వేసి కబ్జా చేయడం జరిగింది. మున్సిపల్ అధికారుల, సిబ్బంది కబ్జాపై రెండు సంవత్సరాలైనా చర్యలపై ఉదాసీనతో వ్యవహరించడం కబ్జాదారుడు ప్రహరీ లోపల అధికారులు సిబ్బంది, కనుసన్నల్లోనే





ఏకంగా అక్రమ రూములు నిర్మించారు. వాటిపై అధికారులు ఏమాత్రం చర్యలు తీసుకోకపోవడం శోచనీయం. గతంలో ప్రహరీ రేకులు తొలగించి కంటైనర్ వేసిన పక్కనే మరో రెండు రేకులు తొలగించి టిఫిన్ సెంటర్, మెకానిక్ షాప్, ఏర్పాటు చేశారు. ఇలా వరుసగా అక్రమ నిర్మాణాలను విస్తరింప చేశాడు. అప్పటికి మున్సిపల్ అధికారులు తీరుపై అనేక విమర్శలు వెల్లువడ్డాయి. అధికారులు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరించడంతో కబ్జాదారులు ఎలాగైనా విలువైన స్థలం దక్కించుకునేందుకు ఈసారి మరికొన్ని రేకులు తొలగించి అక్రమ రూములు నిర్మిస్తున్నాడు. అందులో బెల్ట్ షాపు నిర్వహిస్తుండం గమనార్హం. అక్రమ బెల్ట్ షాపు నిర్వాణపై స్థానిక బస్తీ ప్రజలు అధికారుల తీరుపై మార్కెట్ యార్డ్ కోసం కేటాయించిన స్థలంలో చివరకు బెల్టు షాప్ తప్పుడు ధ్రువీకరణ పత్రాలతో సర్వే నెంబర్ 191కి సంబంధించిన ఇంటి నెంబరు 262/5/55/2/ా, 87 సర్వే నెంబర్లో చూపించి అధికారులను పక్కదోవ పట్టించాడు. కబ్జా నిర్వహించడం పట్ల ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేశారు. అయిన కబ్జాదారులు పట్టువదలని విక్రమార్కుడిలా ఈసారి అటువైపు రేకుల తొలగిస్తూ మరో రెండు రూములు అక్రమ నిర్మాణాలు చేపట్టారు. ఈ అక్రమ కబ్జాలపై బెల్ట్ షాపుపై గతం నుంచి ఏసీసి ఎన్.ప్రసీదాకు అనేక ఫిర్యాదులు వచ్చిన చర్యలు తీసుకోవడంలో పూర్తిగా విఫలమైందని స్థానికులు ఆరోపించారు. ఎప్పటికప్పుడు దాటవేత ధోరణితో వ్యవహరించడం పరిపాటిగా మారింది. బెల్ట్ షాప్ అక్రమ నిర్మాణం అవతలి వైపు కబ్జాల రూములు నిర్మించిన నిర్మాణాలపై స్థానిక తహసీల్దార్ కు ఫిర్యాదు చేసినట్లు ఏసిపి తప్పుకునే ధోరణిలో వివరణ ఇచ్చింది. ఈవరుస కబ్జాలపై డిప్యూటీ కమిషనర్ సాబీర్ అలీకు ఫిర్యాదు చేయగా అధికారుల అలసత్వంపై నిజాంపేట ఉపకమీషనర్ సానుకూలంగా స్పందించి ఏసిపికి తక్షణమే మద్యం బెల్ట్ షాపును, అక్రమ నిర్మాణాల రూములను తొలగించాలని ఆదేశించారు.

డిప్యూటీ కమిషనర్ ఆదేశించిన ఏసిపి మౌనం






దాల్చడం కొసమెరుపు

వరుస కబ్జాలపై చర్యలు తీసుకోవాలని ఏసిపికి డిప్యూటీ కమిషనర్ ఆదేశించిన నేటికీ రూములు నిర్మించిన మద్యం బెల్ట్ షాప్ ఉండగా కేవలం ఒకే ఒక రూము నిర్మాణం తొలగించి తూతూ మంత్రంగా వ్యవహరించారని స్థానికులు వాపోయారు. కబ్జాదారుల పట్ల సదరు ఎసిపి స్వామి భక్తిని చాటుకుంది. ఇంత జరిగినా బెల్ట్ షాప్ పై చర్యలు తీసుకోవడంలో చిత్తశుద్ధి ఎంత ఉందో స్థానిక ప్రజలే బహిరంగంగా తెలియజేశారు. ఇప్పటికైనా పై అధికారులు విచారణ చేపట్టి వెంటనే మార్కెట్ యార్డ్ లో వెలసిన అక్రమ నిర్మాణాలన్నీ తొలగించి ప్రజా ప్రయోజనాల కోసం ఏర్పాటైన ఈ స్థలంలో ప్రజల అవసరాలను తీర్చేటట్టుగా ఉపయోగంలోకి తీసుకురావాలని స్థానికులు తెలియజేశారు.

### దాసర్లపల్లి గ్రామంలో ఉన్న యాదవ డైరీ మిల్క్ భూత్‌లో

# కల్తీ పాల గుట్టురట్టు

### యాదవ డైరీ మిల్క్ భూత్‌లో పాలను కల్తీ చేసిన మారమోని శ్రీశైలం

### మారమోని శ్రీశైలం పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్న కందుకూరు సిఐ వెంకటేశ్వర్లు



మహేశ్వరం, మే 10,(ప్రజా కలం) రంగారెడ్డి జిల్లా మహేశ్వరం నియోజకవర్గం కందుకూరు మండలం దాసర్లపల్లి గ్రామంలో ఉన్న యాదవ డైరీ మిల్క్ భూత్‌లో జరుగుతున్న కల్తీ పాల గుట్టురట్టును కందుకూరు పోలీసులు బట్టబయలు చేశారు. కందుకూర్ మండల పరిధిలోని దాసర్లపల్లి గ్రామంలో ఉన్న యాదవ డైరీ మిల్క్ భూత్‌లో పాలను కల్తీ చేస్తున్నారనే నమ్మదగిన సమాచారం అందడంతో, కందుకూరు పోలీస్ వారు వెంటనే అక్కడికి వెళ్ళి మిల్క్ భూత్‌లో సోదా నిర్వహించగా అందులో మారమోని శ్రీశైలం అను వ్యక్తి ఉన్నాడు. తదుపరి ఆ యొక్క భూతులో సోడా చేయగా ఒక కెమికల్ బాటిల్ ఉన్నది, ఇదేమిటి అని అడగగా హైడ్రోజెన్ పేరోక్సిడె అని తెలిపినాడు. ఇది దేనికి ఉపయోగిస్తారు అని అడగగా, పాలు చెడిపోకుండా ఉండటానికి అని తెలిపినాడు. అదే భూతులో సుమారు 80 లీటర్ల పాలు గుర్తించారు. ఆ యొక్క పాలలో హైడ్రోజెన్ పేరోక్సిడె కలిపినావా అని అడగగా కలపడం జరిగిందని తెలిపారు. దాంతో అట్టి వ్యక్తిని అదుపులోకి తీసుకొని పూర్తి వివరాలు అడగగా, అతను చుట్టుపక్కల రైతుల వద్ద రాత్రివేళ పాలను కొనుగోలు చేసి, వాటిని తర్వాత రోజు ఉదయాన్నే హైదరాబాద్‌కు తీసుకెళ్లి హోటళ్లలో విక్రయిస్తున్నానని తెలిపినాడు. రాత్రి సమయంలో ఫ్రిడ్జ్ లో నిలువ చేస్తే విద్యుత్ ఛార్జీలు ఎక్కువ అవుతుందని, దాని వల్ల నెలకి దాదాపు 7,000 నుండి 8,000 వరకి పవర్ బిల్ వస్తుంది అని, అదే సమయంలో హైడ్రోజెన్ పేరోక్సిడె లీటర్ బాటిల్ 150/- దొరుకుతుండటంతో, దానిని ఉపయోగించటం వలన పాలు ఎక్కువ కాలం నిలువ ఉండటంతో పాటు ఖర్చు కూడా తక్కువ అవుతుంది అని భావించి, పాలను ఉదయం వరకు నిల్వ ఉంచేందుకు ప్రజల ఆరోగ్యానికి హానికరమని తెలిసినా హైడ్రోజెన్ పేరోక్సిడె కలిపి పాలను కల్తీ చేసి, వాటిని హైదరాబాద్‌కు తీసుకెళ్లి హోటళ్లలో విక్రయిస్తున్నానని స్వచ్ఛందంగా తన నేరాన్ని ఒప్పుకున్నాడు. దాంతో షాపులో అమ్మకానికి నిల్వ ఉంచిన 80 లీటర్ల పాలు ఉన్న మూడు పాల క్యాన్‌లు మరియు 300 ఎం ఎల్ హైడ్రోజెన్ పేరోక్సిడె కలిగిన డబ్బాను స్వాధీనం చేసుకొని, నిందితుడు మారమోని శ్రీశైలం యొక్క నేర ఒప్పుకోలు పంచనామా నిర్వహించి, తదుపరి చట్టపరమైన చర్యగా, కేసు నమోదు చేసి, దర్యాప్తు కోనసాగిస్తున్నామని సి ఐ వెంకటేశ్వర్లు తెలిపారు. కల్తీ పలు ప్రజల ఆరోగ్యానికి చాలా హానికరము. అలాగే ప్రజల ఆరోగ్యానికి హానికరమైన, నిషేధించబడిన పదార్థాలను ఎవరైనా విక్రయించినా వారి పై చట్టరీత్యా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.



Corporate .Office :1-7-511/4, Gemini Colony, Near Pochamma Temple, Zamistanpur, HYDERABAD, TELANGANA, 500020 Cell: 9010972526

Printed, Published and owned by **KALAKONDA RAMAKRISHNA**, Printed at **TEJOMAI PUBLICATION**, H.No. 2-24/98/BLN Colony, IDA Uppal Medchal-Malkajgiri, Hyderabad, Telangana-50013 Published from H.No.10-1-7, Bada Bazar, Beside Pothalingaiah Temple, Azam Raod, Nizamabad,TS -503001 TELANGANA - 503001.
Editor: **KALAKONDA RAMAKRISHNA, PRGI.No. TELTEL/2010/33275,** Cell: 90109 72526, Email:prajakalam2010@gmail.com